57361

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

# స్నేహ

జూలై 06, 2008

శ్రీకాకుళం



# 'అందం' కోసం ఆరాటం

# హ్యాపీ బర్త్‌డే

(2008 జులై-6 నుంచి-2008 జులై-12 వరకు)

కె. హర్ష
5సం॥, జులై-2003
శోభ-మల్లారెడ్డి
వెలిమినేడు-నల్లగొండ

షేక్ బాబాఫకృద్దీన్(షాహిద్)
3సం॥, జులై-8
కరిమున్నీ-మహబూబ్‌బాషా
గిద్దలూరు-ప్రకాశం

టి. అభినయ్
7సం॥, జులై-2001
భారతి-నర్సింహ
పటేల్‌గూడ-రంగారెడ్డి

బి. మహిమ
1సం॥, జులై-2007
శ్రీనివాస్-సునీత
రాజమండ్రి-తూ॥గో

టి. సంజన(లౌలి)
1సం॥, జులై-6
ఎస్తేరు-సంసోను
విశ్వేశ్వరాయపురం-తూ॥గో

ఎస్. సందీప్‌కుమార్
జులై
సువర్ణకుమారి-నాగరాజు
కర్నూలు

అవినాష్
జులై-8
అనీత-వెంకటేష్
అశోక్‌నగర్-హైదరాబాద్

పింకి
వెంకటసుబ్బమ్మ-నాంచారయ్య
గుడివాడ-కృష్ణా

సత్యబ్రహ్మరాజు
6సం॥, జులై-2002
చూడామణి-లక్ష్మినర్సింహరాజు
రాజమండ్రి-తూ॥గో

జి. శ్రీహాస్‌రెడ్డి
1సం॥, జులై-2007
స్వేత-రవిందర్‌రెడ్డి
అంబర్‌పేట్-హైదరాబాద్

కె. ప్రకాష్
జులై
రాణి-నాగేశ్వరరావు
విజయవాడ-కృష్ణా

ఎ. నాగసునంద
10సం॥,జులై-1998
లక్ష్మినోము-శ్రీనివాస్
గుడివాడ-కృష్ణా

# పేదలకు న్యాయం చేయాలి

**మన అతిథి**

| | |
|---|---|
| పేరు | : ప్రత్తిపాటి అంకమ్మ చౌదరి (పిఎ చౌదరి) |
| పుట్టిన తేదీ | : అక్టోబర్ 17, 1925 |
| తల్లిదండ్రులు | : చెంచమ్మ, రంగనాయకులు |
| స్వగ్రామం | : నరసాయపాలెం, గుంటూరు (జిల్లా) |
| విద్యార్హతలు | : బిఎ హానర్స్, బిఎల్ |
| వృత్తి | : హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ |
| హాబీలు | : పుస్తక పఠనం |
| నచ్చిన వ్యక్తులు | : రచయితలు త్రిపురనేని రామస్వామిచౌదరి, కొల్లా వెంకయ్య (వీరిద్దరూ నాకు గురువులు కూడా) |
| గుర్తుండిపోయే సంఘటన | : నేను ఇచ్చిన తీర్పుల వల్ల పేదవారికి, రైతులకు చాలా సార్లు మేలు జరిగింది. అలాంటి ఘటనలన్నీ నాకు జీవితాంతం గుర్తుండిపోతాయి. |
| అనుభవాలు | : నా చిన్నతనంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గొప్ప గొప్ప కమ్యూనిస్టు నాయకులు, యోధులు ఉండేవారు. వారందరితో పరిచయాలు ఉండేవి. కొరటాల గారితో నాకు చాలా అనుబంధం ఉండేది. అది నా అదృష్టంగా భావిస్తున్నాను. స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో గాంధీ గారి నేతృత్వంలో ఆందోళనలు ఉత్తేజితంగా ఉండేవి. వాటితో స్ఫూర్తిని పొందాను. |

ప్రతి వ్యక్తి జీవితంలో పైకి రావాలంటే కష్టపడి చదవాలి. తన వృత్తికి న్యాయం చేయాలి. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ ధనార్జనే ధ్యేయంగా మారిపోయింది. ఈ విషయంలో న్యాయవాదులకు కూడా మినహాయింపేమీ లేదు. 'ధనం కలవాడే గొప్పవాడు' అన్నట్లు కాకుండా పేదలకు న్యాయం చేసే విధంగా, వృత్తి ధర్మాన్ని పాటిస్తూ పని చేయాలి.

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| చిన్న కథ | ... | 3 |
| సీరియల్ | ... | 8 |
| సినిమా | ... | 10 |
| సలహాలు | ... | 11 |
| బాలనేస్తాలు | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |


## ఇంకా...




చూద్దామా ... 4
గ్వాలియర్ అందాలు

మంచిపుస్తకం ...6
గాన కోకిలల
గాధా లహరి






| | | |
|---|---|---|
| ఆరోగ్యం | ... | 17 |
| లాహిరి... లాహిరి | ... | 20 |
| మనసా... తెలుసా | ... | 22 |
| రుచి | ... | 23 |
| కొత్త పుస్తకాలు | ... | 24 |

కథ ... 18
తప్పు ఎవరిది?

# ఏలే లక్ష్మణ్ భలే చెప్పారు!

జూన్ 22వ తేదీ ఆదివారం సంచికలో అతిథి ఏలే లక్ష్మణ్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ఏ మనిషైనా సరే ఏదైనా సాధించాలంటే... ఆయన చెప్పినట్టు అంకితభావం, కృషి, పట్టుదల వుంటేనే విజయం వరిస్తుంది. అలాగే పర్సా భారతి గారి జ్ఞాపకాలు చదివి చాలా ఉత్తేజితులమయ్యాం. ధరలు పెరగడమే కాని తరగడం లేదు. మనం కూడా ఇలా పికెటింగ్‌లు చేయాల్సిందే. కుట్ర కథ చదివితే బంగారుపనిచేసేవారి జీవితాలు ఎంత దీనంగా నడుస్తున్నాయో అర్థమైంది. కథను నడిపిన తీరు బావుంది. పైగా యాస ఆ ప్రాంతానికి సరిపోయింది. ఇతర ప్రాంతాలవారికి తెలియవనుకున్న పదాలకు పక్కనే బ్రాకెట్లలో అర్థం ఇవ్వడం ఎంతో బావుంది. జోక్స్ నవ్వు తెప్పించాయి. మరిన్ని జోక్స్ ఇవ్వవలసిందిగా కోరుతున్నాం.

**టి.అనూష, దొప్పలపూడి.**

# వానాకాలం స్పెషల్

ఈ వారం వర్షాకాలానికి సంబంధించి వచ్చే రోగాలను చక్కగా వివరించారు. అసలు ఏయే జబ్బులొస్తాయి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? బాగా వివరించారు. అలాగే కాకర్లమూడి విజయ్‌గారి వ్యాసం బావుంది. వర్షాకాలం చర్మానికి సంబంధించి, వెంట్రుకలు, ఆహారం, వాహనాలు, కరెంటు పోయినప్పుడు... ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో చక్కగా చెప్పారు. ఈసారి వానాకాలం స్పెషల్‌లాగా అనిపించింది. ముదురు కామెంట్లు నిజంగానే ముదురుగా వుంటున్నాయి. చక్రి కబుర్లు చదివాం. నిజంగానే ఆయన అన్నట్లు పరభాషా గాయనీగాయకులు పాడితే అంత ఇదిగా వుండదు. ఏదో ఒకటిరెండు పాటలవరకైతే ఓకేగానీ సినిమాలోని మొత్తం పాటలు వినాలంటే...బోర్.

**కవిత. పి, లక్ష్మీనగర్, మెదక్.**

# అందరికీ అర్థమయ్యేలా ఇచ్చారు

ఈ వారం తెలుసుకుందామలో వర్షాకాలంలో తీసుకోవలసిన జగ్రత్తల గురించి చాలా వివరంగా చెప్పారు. అందరూ ఈ కనీస జాగ్రత్తలు తీసుకుంటే చాలు వారి ఆరోగ్యాలు కాపాడు కోవచ్చు. అలాగే విజ్ఞాన వీచికలో ఉమ్మి గురించి కూడా చాలా వివరాలు తెలిపారు. ఇక కవర్ స్టోరీ వానాకాలం వ్యాధుల కాలం లో కూడా ఈ వర్షాకాలంలో వచ్చే జబ్బుల గురించి సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యేలా ఉన్నాయి. కవర్ పేజీ చాలా బావుంది.

**సుధ, హైదరాబాద్.**

# దేవులపల్లి పాటలు చదివి ఎక్కడికో వెళ్లిపోయాం

కృష్ణశాస్త్రి పాటలను ఇష్టపడనిదెవరు చెప్పండి. అసలు అలా వినిపిస్తుంటే ఇలా ఎక్కడికో వెళ్లిపోతాం. అలాంటిది ఈ పేజీ అంతా చదివేలోపు ఎన్ని మధుర జ్ఞాపకాలు మెదిలాయో లెక్కేలేదు. పాత సినిమాలన్నీ కళ్లముందు కదలాడాయి. ఇంతమంచి పుస్తకాన్ని పరిచయం చేసినందుకు ధన్యవాదాలు.

**పద్మావతి, విజయనగరం.**

# అట్టమీది కథ అదరగొట్టింది

జూన్ 22న అట్టమీది కథ 'వానాకాలం, వ్యాధుల కాలం' అదరగొట్టింది. వ్యాధులు ప్రారంభం కాకమునుపే మాకో హెచ్చరికగా వుంది. జ్వరాలతో జాగ్రత్తగా వుండకపోతే జరగబోయే అనర్థాలను మాకు గుర్తు చేశారు. కలవరపెట్టే కలరా అంటూ సూక్ష్మ క్రిమి వల్ల కలరా వస్తుందని వివరించిన తీరు బాగుంది. తిరగబెట్టే టైఫాయిడ్, బంక విరేచనాలయితే ఫైలేరియాసిస్‌తో ప్రమాదం, నారి కురుపు అంటూ డెంగ్యూ గురించి చాలా చక్కగా వివరించారు. రోగ నిరోధక శక్తి లేకపోతే ఇంతే సంగతులు... అంటూ నిజమైన విషయాలను మాతో ముచ్చటించారు. మన జీవితంలో రోగాలకు మూలకారణం దోమలు, ఈగలేనని నిర్ధారణ అయింది. డాక్టర్ ఎన్. పాపారావు గారు ఇచ్చిన సందేశంలో వ్యాధుల




నిర్మూలన మన చేతుల్లోనే అంటూ ప్రత్యేకంగా చెప్పినందుకు ధన్యవాదాలు. అట్టమీది కథను మాకు అర్థమయ్యే రీతిలో చక్కని ఫొటోలు వేసి, ప్రచురించిన ఎడిటర్ గార్కి నా నమస్కారాలు. తెలుసుకుందామాలో వర్షాకాలంలో ఈ జాగ్రత్తలు తప్పని సరి అంటూ బట్టలు, తల తడిస్తే ఏం చేయాలో చాలా సూటిగా వర్ణించారు. తడిగుడ్డలతో వుంటే ఏ సమస్యలు వస్తాయో, తడి తలతో ఉంటే ప్రమాదం ఏమిటో తెలుసుకో గలిగాం. కరంటు పోయిన ప్పుడు, పిడుగులు పడినప్పుడు ఎలా వుండాలో ముందు జాగ్రత్తగా మాకు చెప్పిన మాట బాగుంది. వానా కాలంలో పారిశుధ్యం, పరిశుభ్రత చాలా కీలకమైనవి. ఈగలు, దోమలు రోగక్రిములతో మనపై పొంచి వుంటాయి. అనేక వ్యాధుల్ని వ్యాపింప చేస్తాయి. అప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చక్కగా వివరించారు. అందుకు డాక్టర్ కాకర్లమూడి విజయ్ గారికి ప్రత్యేక అభినందనలు.

**కర్రా వరప్రసాద్, యలమర్రు, కంర్రిక, కృష్ణా జిల్లా.**




## ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహి తులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచి కరమైన వంటలు, అల్పా హారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుం టారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదల చుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

---

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోకనగర్, హైదరాబాద్-20.

కథా నిలయం
శ్రీకాకుళం

## చిన్న కథ

జావెద్

పచ్చని పంటపొలాలతో, పాడీ పశువులతో కళకళలాడాల్సిన పల్లెలు పాలకుల స్వార్థానికి బలవుతున్నాయి. ప్రభుత్వ విధానాల ఉచ్చులో కొట్టుమిట్టాడుతున్నాయి. వ్యవసాయ రంగంలో బహుళజాతి సంస్థల ప్రవేశంవల్లా, కార్పొరేట్ వ్యవసాయం వల్లా, వ్యాపార సంబంధిత పంటలకే ప్రాధాన్యతనివ్వడం వల్లా, చిన్నా చితకా రైతులూ, వ్యవసాయాధారిత పనులు చేసుకునే కూలీలూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఉన్నవూర్లో పనిదొరకక నగరాలకూ, పట్టణాలకూ, వలసెళ్తున్నారు. అక్కడ కూడా గుత్తేదార్ల చేతిలో, కాంట్రాక్టర్ల చేతిలో మోసపోతున్నారు. తరతరాల నుంచి స్వార్థపర రాజకీయానికీ, బడాబాబుల, భూస్వాముల, కాంట్రాక్టర్ల, గుత్తేదార్ల చేతుల్లో శ్రమదోపిడీకీ గురవుతున్న వలస కూలీలది ఒక్కొక్కరిదీ ఒక్కో బతుకు వ్యథ ఊరొదిలి వెళ్లిన ఓ వలస కూలి హృదయాలాపనే ఈ కథనం.

# యాదికొస్తున్నయ్...!

ఇగో... నాయ్నా...! నీవక్కడ పైలమేగదా! అమ్మ బాగుండాదే.... సెల్లీ, తమ్ముడూ, లచ్చవ్వా ఎట్లున్నరు? ఇంటెన్క సైదులు మావా, సేనుపక్కల యాదన్నా అంతా సంతసంగున్నరా... గట్లుండా లని నేనెప్పుడూ దేవున్ని మొక్కుతుంటాను తెల్సా! ఏదో టైం బాగోలేక దేశంగాని దేశాన్కొచ్చిన. కలో గంజో దాగి పైసాపైసా గూడవెడ్తున్న. ఇంకో నెల్రోజుల్లో పల్లెకొస్త. నిరుడు ఎర్వులకోసం ఎల్లందొర దగ్గర జేసిన బాకీ, గాసం కోసం నర్సయ్య పటేలు దగ్గర జేసిన బాకీ నయాపైసా లేకుండా ముట్టజెప్తుదం. ఈయేడైనా అప్పుల బాధలేకుండా బత్కుదం. ఇగ సెల్లి పెండ్లంటవా అదింకా సిన్నపిల్లే గదనే. ఈసారి తొల్కరి దయజూపుతే, పంటమంచిగ పండుతే మస్తుగజేద్దంగాని. ఒక్కగానొక్క ఆడపిల్ల ఆ మాలచ్చికి మంచి సంబంధం జూడమని మావకు జెప్పుండ్రి.

అన్నట్టూ... నేనీడున్నట్టేగానీ పాన మంతా పల్లెసుట్టే తిర్గతాందే. అడివికి పోయినప్పుడు దోస్తుల్తో గలిసి గుట్టలపొంటీ, గట్లపొంటీ, వాగుల్లా, వంకల్లా తిర్గుతుంటిమి. మేమెక్కని సెట్లులేవు. ఎక్కని కొండలు లేవు. దాటని ఏర్లు లేవు. నక్కెర పండ్లూ, పర్కెపండ్లూ, ఉలింత పండ్లూ తెంపుకొచ్చి తలా ఇన్ని పంచుకుని తింటుంటిమి. మీకోసం ఇంటికి దెస్తే... అడివిల వట్కి ఎందుకు దిర్గవొయ్యిండ్రా అంటుంటిరి గదే. పొద్దస్తమానం దూల్లెంబడి తిరిగీ తిరిగి పొద్దుమూకి ఇంటికొస్తె, 'అయ్యా... అల్సిపోయినావ్‌రా...' అని అమ్మ తైదరొట్టె మీద చింతపండు కారమేస్కొని తెస్తుండె. అబ్బ గదేం రుచో. యాదుకొస్తె నోరుర్తుందే. ఒక్కపూట తింటే అంబటాల్లయినా ఆకలయ్యేది గాదు. గీ పట్నం తిండిల సారం లేదు. హోటల్ల వోతే ముప్పయ్‌రూపాలిస్తే గిన్నెల సగం అన్నం పెడ్తరు. పూటకు అర్దశేరు బియ్యం తినేటోన్ని గదేం సరిపోతదే నాకు. అందుకనే పనిజేసేకాడ్నే జోబ్డీ ఏస్కున్న బియ్యం దెచ్చుకుని వండుకు తింటున్న. ఇక్కడ నేనొక్కన్నేగాదే మన పాలమూరు పల్లెల్లోంచి వొచ్చినోల్లు శానామందే ఉన్నరు. ఆల్లంతా ఏదో సంపాదించి బంగ్లా కడ్దమని వొచ్చినోల్లు గారులే. మనలాగే పూటగడ్వనోల్లు. పంటలు వండక, సర్కారు సాయంలేక అప్పుల పాలైనోల్లు. బిడ్డల పెండ్లిల్లకు షావుకార్ల దగ్గర బాకీలు జేసినోల్లు. ఏం జెప్పమంటవు ఒక్కొక్కర్దీ ఒక్కో బత్కుతీరు. ఎవరి బాధలు ఆల్లకుంటయ్ గదా. కూలీబత్కులల్ల కూటికే కరువుగానీ, పేమలకేం తక్కువ జెప్పు. అజిలాపురం తండా నుంచొచ్చిన మణక్కా, సింగాయిపల్లి నుంచొచ్చిన రాందాసన్నా, పర్దిపురం నుంచొచ్చిన చెంచు గంగన్నా అందరూ నన్నెంతో బాగ చూస్కుంటరు. అందరం కలిసి పనిజేయడమే గాదు. కష్టాల్ని కూడా కలిసే పంచుకుంటున్నం.

అమ్మా నువ్వెట్లున్నవ్... పైలమేనా 'తనకు గజ్జెల పట్టీలు దెస్తేగానీ సాలెకోన'ని సెల్లి ఏడుస్తుండె గదనే. ఏడ్సినప్పుడల్లా నువ్వేమో ఏదేదోజెప్పి సంజాయిస్తుంటివి. గప్పుడు పైకి జెప్పకుంటిని గానీ నాకు శాన బాధన్పించేది దెల్సా! బడికెల్లెటోల్లంతా మంచి మంచి బట్టలూ, కాల్లకు పట్టీలూ ఏస్కపోతుంటే నా సెల్లి పాతబట్టల్తో, కాల్లకు పట్టీలు లేకుండా పోతుందని లోలోపలే దుక్కపడుతుంటిని. ఎప్పటికైనా సెల్లికోరిక నెరవేర్చాలనుండేదే. అందుకే వొచ్చేటప్పుడు గజ్జెల పట్టీలు తీస్కొత్తాననిజెప్పు. ఇప్పుడు పదోతరగతి గూడా అయిపోయింది గదా... పెద్ద సద్వుకోసం సెల్లి టౌనుకెళ్తది. పట్టీలేసుకుని తను నడుస్తుంటే అచ్చం లచ్చిందేవిలా కన్పిస్తది కదమ్మా. రెక్కలిడ్సుకోనయినా సరే సెల్లిని కలెటర్ని జెయ్యాల్నే... గదే నా ఆశ. ఎప్పుడూ నాతో కొట్లాడ్తుండె, ఒక్కరోజు కన్పించకపోయినా 'అన్నా... యాడికోయినవ్‌రా?' అని అడుగుతుండె. బడికెల్లి రాంగనే సెల్కకొచ్చి వొరం మీద నిలబడి పిలుస్తుండె. నేను బొంబయొచ్చేట్రోజు గూడా మల్లెప్పుడొస్తవనీ ఏడ్చింది. అమ్మా సెల్లిప్పుడె ట్లుందే... పూటకన్నం తింటుందా? దోస్తుల్తో కలిసి తొక్కుడు బిల్లా, కోతికొమ్మచ్చీ ఆడ్తుందా? వొరం మీదో, మంచె మీదో కూసోని ఎన్నెల్లా నవ్వుతాందా? పారుతున్న యేరల్లే రాగాలు దీస్తోందా? నా సెల్లెప్పుడూ నవ్వుతూ ఉండాల్నే. ఏం రంది వెట్కోవద్దని జెప్పు.! తమ్ముడు గూడా ఇప్పుడెనిమిదో తర్గతి గదా. ఆన్కి గూడా బట్టలూ, పుస్తకాలూ దెస్తనని జెప్పు. సెల్లీ, నీవూ, నాన్నా, తమ్ముడూ అందరూ కళ్లముందు దిర్కుతున్నట్లుందే. ఏం సింత వెట్కోకుండ్రి. తొందర్లోనే వస్తగదా!

అమ్మా తొల్కరొచ్చింది గదే. కార్తిపండ్గ ఎట్ల జేసుకున్నరు. మొన్నయితే ఇక్కడ వాన బాగనే వడ్డది. నాకైతే మన సెలకా, పశువులూ, అడవీ అన్నీ గుర్తొచ్చినయ్. ఇప్పుడూర్లో ఉంటే గిట్ల నాగలి భుజానెత్తుకుని, కోలకట్టె చేతిల వట్టుకొని సెలకమొకం బట్టెటోన్ని అన్కున్నాను. వానపడ్డప్పట్నుంచీ ఊరొంకనే మనసువడ్డది. వెంటనేపోయి పొలం దున్ని ఇత్తనాలేద్దమన్కున్న కానీ గుత్తేదార్ పైసలియ్యలేదు. రేపూ మాపూ అంటున్నడు. ఆ పైసలు చేతికి రాంగనే వస్త. ఎవ్వరితోనైనా ఇన్ని తైదలూ, వొడ్లూ, సామలూ అర్వుదేండ్రి. అదునుజూసి నారువోద్దంగాని. ఇంకోమాట... రైతుసంఘపోల్లు మండలాఫీసుల ఇత్తనాలిప్పిస్తుండ్రంట గదా! ఇయ్యకుంటే రైతులంతా గల్సి పోరుజేస్తుండ్రనీ టీవీలల్ల జెప్తుండ్రనీ దెల్సింది. బయట గొనిమోసపోయేకన్నా అక్కడ తీసుకోవడం మంచిదిగదా! సరిపోను దొర్కుతయోలేదో, దొర్కినకాడికైతే తీస్కోండ్రి. ఇంకా గావాలని అడుగుండ్రి. మీరు గూడా గారైతు సంఘపోల్లెంటవొయ్యి పోరాడుర్రి. ఊర్లోవాన వడ్తే మస్తుగుంటది గదమ్మా! తొలకరి సిన్కులు రాలంగనే సెట్లన్నీ సక్కగా ముస్తాబైన పెండ్లిపిల్లల్లా ఉంటయ్ గదే. మన పల్లెర్ల సెలకైతే పచ్చజీర కట్టుకున్న పడుచుపిల్లలా భలే అందంగుంటది. పచ్చని గడ్డిమీద పాకుతున్న ఎర్రని ఆరుద్ర పురుగులూ, రాత్రిపూట మిణుకుమిణుకు మనే మిణుగురు పురుగుల వెలుతురూ నా కళ్లముందు కదలాడుతున్నట్టే ఉంది. పల్లెసుద్దులన్నీ యాదికొస్తే పానం జివ్వుమంటాంది. ఇక్కడొక్క గడియ గూడా నిలవడ బుద్ధి ఐత లేదు. సేటు పైసలియ్యంగనే వొస్త. ఎక్కడైనా కష్టాన్నీ, మట్టినీ నమ్మి బత్కెటోల్లమే. ఆ బత్కేదో కన్నతల్లి లాంటి పల్లెతల్లి ఒడి లోనే పదిలంగి బత్కుదం. ❋



# గ్వాలియర్ అందాలు

మధ్యప్రదేశ్‌లో ఊర్వహి నదీతీరాన నిర్మించిన పట్టణం గ్వాలియర్. ఇది ప్రధానంగా మూడుభాగాలుగా ఉంటుంది. కొండ దిగువున గ్వాలియర్ టౌను. దక్షిణదిశగా లష్కర్. ఇది 19వ శతాబ్దిలో మహారాజా దౌలత్‌రావు సింధియా నిర్మించిన సైనిక శిబిరం. మూడవది మొరార్ టౌన్. ఈ మూడు భాగాలకూ కూడలి మాత్రం బుర్రా. ఇక్కడి కట్టడాలన్నీ ముఖ్యంగా దౌలత్‌గంజ్ ప్రాంతంలో ఇళ్ళన్నీ ఇసుకరాతితో విస్తారంగా మలచిన నగిషీలతో తీర్చిదిద్ది ఉంటాయి. ఇక్కడ కాలేజి, హైకోర్టు భవనాలు కూడా 19వ శతాబ్దినాటివే, సంప్రదాయ శిల్పరీతిలో ఎంతో ఉదాత్తంగా ఉంటాయి. గ్వాలియర్ రేయాన్ ఫ్యాక్టరీవైపు వెళితే అక్కడ ముస్లిం మహాత్ములు, మహమ్మద్ గౌస్, ఖ్వాజాఘ్యామాన్, బాబాకపూర్‌ల సమాధులున్నాయి. ఇక్కడే తాన్‌సేన్ సమాధికూడా ఉంది. జైవిలాస్ పాలెస్ దగ్గర మహారాజా మాధవరావు తల్లిగారి విగ్రహం, ఇంద్రగంజి ప్రాంతంలోని కూడలిలో మహారాజా మాధవరావు విగ్రహం ఎంత ఠీవిగా ఉన్నాయంటే ప్రతి అణువులోనూ రాజదర్పం ఉట్టిపడుతూ ఉంటుంది. ఆయన అధిరోహించిన గుర్రం కూడా అంతే దర్పంతో ఆకట్టుకుంటుంది.



ఊరికి దాదాపు మధ్యలో ఉన్న మహోన్నత పర్వతం, 300 అడుగుల ఎత్తున, దాదాపు 3కిమీ వెడల్పున విస్తరించి ఉంది. పైన రాజప్రాకారం 30/35 అడుగుల ఎత్తుండి, దాని కింద కొండ భాగమంతా నున్నగా చెక్కి శత్రుదుర్భేద్యం చేశారు. కోట పరిమాణం ఎంతటిదంటే ఇక్కడ ఎనిమిది జలాశయాలు, ఆరు రాజమందిరాలు, ఆరు ఆయలయాలు, ఒక గురుద్వారా వున్నాయి. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన గ్వాలియర్ పబ్లిక్ స్కూల్ కూడా ఈ కోటలోనే ఉంది. ఈ పర్వతారోహణ ఒక వింత అనుభూతి. సరాసరి పైకి ఎగబాకినట్లే ఉంటుంది. ఇది కూడా శత్రువులను దృష్టిలో ఉంచుకుని భారీ వాహనాలతో పైకి వచ్చే అవకాశం లేకుండా ఏర్పాటు చేశారనిపిస్తుంది. దీనకి రెండు మార్గాలున్నాయి. ఒకటి గ్వాలియర్ గేటు గుండా, రెండవది ఊర్వహి నదివైపు ఉన్న గేటు ద్వారా వెళ్ళవచ్చు. రెండు మార్గాలు పైకి ఎగబాకినట్లే ఉంటాయి. అందుకే నడచి వెళ్లడమే క్షేమం.అక్కడి మెట్లు ఎక్కడం కష్టమనిపించినా పైకి వెళ్లిన తరువాత దర్శనమిచ్చే సుందరదృశ్యాలు, చారిత్రక విశేషాలు మన శ్రమను క్షణంలో మరిపిస్తాయి. చింతచెట్లు ఈ పర్వత శిఖరాన ఎలా పెరిగాయోగాని, పచ్చని జుట్టు విరబోసుకున్నట్లు నిలిచివున్నాయి. ఉదయపు సూర్యకాంతితో లేత బంగారు రంగులో ఉన్న మందిరాలు ఒకనాటి సోయగాన్ని , కాలగతిలోని విషాదాన్ని కలబోసి మనలను ఆహ్వానిస్తుంటాయి. అసలీ కాలిబాటలోనే ఎన్నో విశేషాలున్నాయి.

విష్ణుమందిరం





ఖిల్లాలో చూడతగిన కట్టడమిది. దీనిని భోజరాజు నిర్మించాడని ప్రతీతి. అంటే ప్రమర వంశీయులైన భోజుడు కాదు. అంతకు ముందటి వారైన ప్రతీహారుల వంశపు మిహిర భోజుడు. ఈయన కనౌజ్ రాజధానిగా ఒక మహాసామ్రాజ్యాన్నీ నిర్మించి దాదాపు 50 సంవత్సరాలు పరిపాలించాడు. ఇది 9వ శతాబ్దపునాటి మాట. ఈ మందిరంలో రెండు శాసనాలు ఉన్నాయి. వీటి ప్రకారం, ఈ మందిరం పర్వతం మీదకి దారి , పర్వతం పైనున్న రాజ ప్రాసాదాలు, ఈ నిర్మాణాలన్నీ రామభద్రుని కాలంలో ప్రారంభమై, ఆయన కుమారుడు మిహిరభోజుని కాలంలో పూర్తయ్యాయి. అంటే 43 సంవత్సరాల కాలం పట్టింది. బహుశా ఈ కట్టడాలు శిథిలమై, వాటి మీద తరువాతి కట్టడాలు నిర్మించివుండవచ్చు. ఈ ప్రక్రియ ఇక్కడి మాన్ మందిరం వద్ద మనం గమనించవచ్చు. ఈ విధంగా ఈ ఖిల్లాకు 11 శతాబ్దాల సుదీర్ఘ చరిత్ర వున్నదని ఈ శాసనాల వల్ల తెలుస్తోంది.

### నౌ చౌకీ

జహంగీర్ మందిరానికి దగ్గరలోనే తొమ్మిది కారాగారాలున్నాయి. వీటిని నౌ చౌకీ అంటారు. మొఘలుల కాలంలో ప్రమాదమనుకున్న వ్యక్తుల్ని, దుర్భేధ్యమైన ఈ కొండమీద, చీకటి కొట్లల్లో బంధించి ఉంచేవారని చెప్పుకుంటారు. ఔరంగజేబు రాజ్యాధికారం కోసం చేసిన యుద్ధంలో ఆయన దాయాదులను ఇక్కడ బంధించాడంటారు. వారలా, ఈ గుహల్లోనే జీవించినంతకాలం జీవించి ప్రాణాలు వదిలేవారు. లేదా వధింపబడేవారు. వీరిలో ఔరంగజేబు సోదరుడు మురాద్, అతని పెద్ద కుమారుడు సుల్తాన్ కూడా ఉన్నారు.

### జౌహార్ సరస్సు

మిహిరభోజుని తరువాత గ్వాలియర్ కచ్ఛపుల అధీనంలోనికి వెళ్లింది. ఈ వంశంవారు 12వ శతాబ్దం వరకు పాలించారు. రాజపుత్ర స్త్రీలు శత్రువుల చేతికి చిక్కి పరాభవం కాకుండా తమకు తాము ఆత్మార్పణ చేసేవారు. ఒక పెద్ద గదిలో కట్టెలు పేర్చి మంటలు వచ్చిన తర్వాత స్త్రీలందరూ పసుపు కుంకుమలతో నిండుగా అలంకరించుకుని ఆమంటలున్న గదిలోకి ప్రవేశిస్తారు. ఆ విధంగా వారి స్వాభిమానం ముగిసిపోతుంది. ఈ జౌహార్ జరిగిన స్థలంలో ఇప్పుడొక తటాకం ఉంది. ఖిల్లాకు ఉత్తరభాగానున్న దీన్ని జౌహార్ టాంక్ అంటారు. ఇక్కడే మరో గాథకూడా ఉంది. భీమరాజుకు రోషన్ అనే ప్రియురాలుండేదట. 1755 లో భీమరాజు మరణించినపుడు, ఈ ముస్లిం వనిత అతడితో సహగమనం చేసిందట. అదే ఈ ప్రాంతం. ఈ తటాకానికి ఉత్తరదిక్కున రాజా భీమ్‌కు నిర్మించిన స్మారక చిహ్నం ఇప్పటికీ ఉంది. ఈ రెండు వృత్తాంతాలలో దేనివల్ల దీనికి జౌహార్ తటాకమని పేరు వచ్చిందో చెప్పటం కష్టం. ఒకవేళ రెండూ ఇక్కడే సంభవించాయేమో!

### మాన్ మందిర్

ఖిల్లాలో ఇప్పటికీ నిలచివున్న కట్టడాలలో ఇది అత్యంత సుందరమైనదిగా చెప్పుకోవాలి. 9వ శతాబ్దపు మిహిరభోజుని కాలంనాటి కట్టడపు శిథిలాల మీద, మాన్‌సింగ్ నిర్మించిన ఈ మందిరం, కొండ అంచున సరాసరి పైకెదిగి, ఎత్తైన గోడలు వర్తులాకారపు స్థంబాలు, వాటిమీద ఛత్రాలు, గోడలకు అమర్చిన నీలం, అకుపచ్చ, పసుపు, ఎరుపు రంగు పలకలతో ఒక ఉదాత్తమైన సౌందర్యాన్ని సంతరించుకుంటుంది. బాబరు ఈ జిల్లాను సందర్శించినపుడు ఉదయభానుని లేత కిరణాలలో రంగులు వెదజల్లుతూ, దర్పం ఉట్టిపడుతున్న ఈ మందిర దృశ్యాన్ని ఎంతగానో మెచ్చుకున్నాడట. ముఖ్యంగా పాలరాతో తీర్చిదిద్దిన పరదాలు ఒక పనిపడి కాదు. ఒక అకృతి కాదు, ఎన్నెన్నో అందాలు వాటిలో నిక్షేపించారు.

### సింధియా స్కూల్

ఖిల్లాలోనే సింధియా స్కూల్, బ్రిటిష్ పబ్లిక్ స్కూల్స్ తరహాలో నిర్వహిస్తున్నారు. ఇక్కడి భవనాలు, పరిసరాలు, పార్కులు, గూడా యూరోపియన్ దేశాల్లోలా ఉంటాయి. మన దేశపు నలుమూలలనుండి విద్యార్థులు ఇక్కడి వస్తారు. ఖర్చు ఎక్కువైనా దానికి ప్రతిఫలం ఒకజీవిత కాలాన్ని ప్రభావితం చేస్తుంది.

### సాస్ బహు మందిరాలు

ఇక్కడ రెండు మందిరాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పెద్దది, మరొకటి చిన్నది. వీటికి ఈ పేర్లు ఎలా వచ్చాయో తెలీదుకానీ వీటిని సాస్ బహు మందిరాలు అంటారు. అంటే అత్తాకోడళ్ల మందిరాలు. రెండంతస్తులతో బహు సుందరంగా ఉన్న పెద్ద మందిరం అత్తగారిది, ఈ మందిరం ముఖద్వారం వద్ద ఇక్కడ మలిచిన శిల్పాల వివరాలు, దీని నిర్మాణవ్యయం, నిర్వహణ కిచ్చిన దానాల వివరాలు కనిపిస్తాయి.

### ఫూల్‌బాగ్

ఖిల్లా కిందికి దిగి వస్తే ఒకనాటి రాజోద్యానవనం ఫూల్‌బాగ్ ఉంది. ఇక్కడే చిన్న జంతు ప్రదర్శన శాల, మ్యూజియం కూడా ఉన్నాయి. ఇంకా గోపాలుని మందిరం, గురుద్వారా, మసీదు, థియోసాఫికల్ లాడ్జికూడా ఉన్నాయి. ఇక్కడున్న మహారాజుల విశ్రాంతి మందిరాలలో మోతీలాల్ గోడల మీద చిత్రకళ చూడదగ్గది. ఇప్పుడు ఈ భవనాలన్నింటిని ప్రభుత్వ కార్యాలయాలు ఆక్రమించుకున్నాయి.

### ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహం

ఫూల్‌బాగ్ కు దగ్గరలోనే లక్ష్మీబాయి మరణించింది. అక్కడామె విగ్రహాన్ని నిర్మించి ఈ ప్రదేశాన్ని చిరస్మరణీయం చేశారు. గుర్రాన్నధిరోహించిన లక్ష్మీబాయి విగ్రహం తన కరవాలాన్ని పైకెత్తి శత్రువుపై వేటు వేస్తున్నట్లుంటుంది.

### తాన్ సేన్ సమాధి

గ్వాలియర్ కు దగ్గరలోనే ఉన్న బేహాత్ గ్రామంలో తాన్ సేన్ జన్మించాడు. అక్కడే రాజామాన్ సింగ్, మృగనయని నెలకొల్పిన సంగీత కళాపీఠంలో శిక్షణ పొంది అసమాన గాయకుడిగా పరిణతి పొంది అగ్బరు దర్బారును తన సుస్వరగాన మాధుర్యంతో మెంచెత్తి సంగీత సాగరం అనిపించుకున్న కళానిధి తాన్‌సేన్. తాన్‌సేన్ ఆధ్యాత్మిక గురువు షేక్ మహమ్మద్ గౌస్ సమాధి దగ్గరే తాన్‌సేన్‌ను కూడా సమాధి చేశారు. ఇది గ్వాలియర్ కు కొద్ది దూరంలో ఉంటుంది.

### జై విలాస్ పాలెస్

ఫూల్ బాగ్ పక్కనే ఉన్న రాజప్రాసాదం జైవిలాస్ పాలెస్. ఇది రాజవంశీయుల నివాసగృహం. ఇందులో ఒక భాగాన్ని ఇప్పుడు మ్యూజియంగా మార్చారు. దీన్నే జియాజీరావు సింధియా మ్యూజియం అంటారు. ఆనాటి రాజులు సేకరించిన వస్తు సమదాయాన్ని దీనిలో ప్రదర్శిస్తారు. దీన్ని ఆర్కిలాజికల్ వారు నిర్వహిస్తున్నారు. గైడు లేకుండా మాత్రం లోనికి వెళ్లనివ్వరు.

❄



**వీరి వీరి గుమ్మడి పండు**

**వీరి పేరేమి?**

ఈ ఫొటో ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడిది. ఎవరో తెలియాలంటే 21వ పేజీ చూడండి

ఓ మంచి పుస్తకం

తెర

# గాన కోకిలల గాథా లహరి

'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది' అని శేషేంద్ర శర్మ రాసినట్టు మన జీవితాల్లో పాటల పరిమళం పరుచుకుని వుంటుంది. అమ్మ పాడిన లాలి పాటలతో మొదలయ్యే ఈ సంగీత ప్రభావం ఆఖరి క్షణాల్లో శోక సంగీతం వరకూ సాగవలసిందే. ఇందులో స్థాయి, అభిరుచి ఏదైనా కావచ్చు. సాంకేతిక ప్రక్రియ కూడా ఏదైనా కావచ్చు. ఆదిమానవుల వేట శబ్దాలు మొదలుకొని అత్యాధునికుల ఐప్యాడ్‌ల వరకూ! అయితే చలన చిత్ర గీతాలు ఈ సంగీత ప్రస్థానాన్ని కొత్త మలుపు తిప్పాయి. ఇప్పుడు పాట అంటే ప్రధానంగా సినిమా పాటే! పిల్లలూ తల్లులూ ఏదో ఒక సినిమా పాట పట్టుకుని కూని రాగాలు తీస్తూనే వుంటారు. టీవీలలో చూస్తూనూ వుంటారు. ఇప్పుడు దాదాపు ప్రతిఛానల్‌లో క్రమం తప్పకుండా వచ్చే పాటల పోటీలు చూస్తూ చిన్న పిల్లలు కూడా ఎంత గొప్పగా సాధనచేస్తున్నారో అర్థమవుతుంది. ఇలాటి సినీ సంగీతంలో ఎనలేని కీర్తి ప్రతిష్ఠలార్జించిన గాయనీమణుల కథల సమాహారమే 'కొమ్మా కొమ్మా కోకిలమ్మా'. సంగీత సాహిత్యాలలో సముచిత పరిజ్ఞానం గల సీనియర్ రచయిత్రి ఇంద్రగంటి జానకీబాల సమకూర్చిన ఈ పుస్తకం మన గాయనీమణుల గానమాధుర్యాలనే గాక వారి జీవితాలలోని తీపినీ చేదునూ కూడా కళ్లకు కడుతుంది.

రంగస్థలం నుంచి వెండితెర ప్రవేశం చేసి ఆపైన నటగాయనీమణులుగా రాణించిన వారిని తొలుత పరిచయం చేసి తర్వాత నేపథ్య గాయనుల జీవిత చిత్రణ తీసుకున్నారు. తెలుగు సినిమాకు పాడుతూ పరిచయమైన తొలి నాయిక సురభి కమలాబాయి. 1931లో టాకీ పులి హెచ్.ఎం.రెడ్డి తొలి చిత్రం 'భక్త ప్రహ్లాద'లో ఆమె లీలావతిగా నటించారు. సురభి నాటక సంస్థ నుంచి వచ్చిన ఆమె పాతాళభైరవి, మల్లీశ్వరి వంటి చిత్రాలలో తల్లి పాత్రలలోనూ మెప్పించారు. 'కీచక వధ'లో ద్రౌపదిగా ఆమె నటనకు ప్రసిద్ధ గాయకుడు సైగల్ కూడా ముగ్ధుడైపోయాడట.

తర్వాత కన్నాంబ. 1935లో హరిశ్చంద్ర ద్వారా సినిమా రంగానికి పరిచయమైన కన్నాంబ గంభీర పాత్రలకు పెట్టింది పేరు. 1935లోనే 'పల్నాటి యుద్ధం'లో నాయకురాలు నాగమ్మగా చెరగని ముద్ర వేశారు. సినిమాలోకి వచ్చినప్పటి వయస్సును, ఆకారాన్ని బట్టి ఆమె ప్రధానంగా ప్రౌఢ పాత్రలనే పోషించి ఔననిపించుకున్నారు. తొలిదశలో 'సౌదామిని, గృహలక్ష్మి, చండీరాణి' వంటి చిత్రాల్లోనూ మాతృమూర్తిగా 'రాజమకుటం, ముద్దుబిడ్డ, తోడికోడళ్లు' వంటి చిత్రాల్లోనూ కన్నాంబ తనకు తానే సాటి అయ్యారు. నటిగా స్థిరపడిన తర్వాత పాటలు పాడటం మానేసి నేపథ్య గాయనులతో పాడించుకున్నారు.

గానం, అభినయంతో పాటు ఇంకా అనేకానేక ప్రతిభా విశేషాలతో ప్రేక్షకులను అలరించిన అపురూప తారామణి భానుమతి. తండ్రి ప్రేరణతో చిన్నప్పుడే సంగీతం నేర్చుకున్నారు. 1939లో వరవిక్రయంతో చిత్ర రంగ ప్రవేశం చేసిన భానుమతి తనకు తనే ఒక చరిత్ర. మహిళా లోకం గర్వించదగిన చరిత్ర. పురుషాధిక్య ప్రపంచాన్ని సవాలు చేసిన సాహసం, సమర్థత ఆమె స్వంతం. మొదట నటించి పాడిన చిత్రాలు జయప్రదం కావడంతో భానుమతికి అంతకంతకూ ఆదరణ పెరిగింది. నట జీవితంతో పాటే సాహిత్య వ్యాసంగం కూడా ప్రారంభించారు. 1943లో దర్శకుడు రామకృష్ణను వివాహం చేసుకున్నారు. భర్తతో కలసి భరణి సంస్థను స్థాపించి 'రత్నమాల' చిత్రం తీశారు. తొలిచిత్రంలో మాత్రం సంగీత కల్పనకు ఘంటసాల, రాజేశ్వరరావు వంటి వారి సహాయం తీసుకున్నారు. తర్వాత తమ చిత్రాలన్నిటికీ ఆమే సంగీతకర్త. గాయనులు ఎందరున్నా ఖంగున మోగే భానుమతి కంఠంలోని ఖణిసం మరెవరికీ లేదని అందరూ అంగీకరించిన సత్యం. నటిగా, నిర్మాతగా, దర్శకురాలుగా ఎన్ని విజయాలు సాధించినా పాట పాడటం మానుకోలేదు. గాయనిగా నాయికగా అయిదు తరాల ప్రేక్షకులను ఆకట్టుకున్న ఘనత ఆమె స్వంతం. పాడిన పాటల్లోనూ అన్ని తరహాలున్నాయి. 'మల్లీశ్వరి, బొబ్బిలియుద్ధం, బాటసారి, లైలామజ్నూ' చెప్పాలంటే లెక్కలేనన్ని. స్వంత చిత్రాలన్నిటిలోనూ తప్పనిసరిగా శాస్త్రీయ సంగీతం వుండేది. 'మల్లీశ్వరి'లో మేఘమాల పాట, 'బాటసారి ఓ బాటసారి నను మరువకోయి' వంటివి విషాదం కురిపిస్తే 'చక్రపాణి'లో 'వుయ్యాల జంపాలలూగరావయా', 'అంతస్తులు'లో 'దులపర బుల్లోడా దుమ్ము దులపరా బుల్లోడా' వంటి పాటల్లో వినోదం చిలకరిస్తుంది. 'ఎన్టీఆర్, ఏఎన్నార్ నా పక్కన నటించారుగాని నేను వారి పక్కన నటించలేదు' అని ప్రకటించగలిగిన స్థైర్యం చూపిన ఒకే ఒక నటి భానుమతి. వయసు పైబడిన తర్వాతా వదినగా, తల్లిగా మామ్మగా కూడా ఆమె ప్రధాన పాత్రలే ధరిస్తూ వచ్చారు. 'మట్టిలో మాణిక్యం, మంగమ్మ గారి మనవడు, మండలాధీశుడు, తాతమ్మ కల' వంటి చిత్రాల్లో ఆమె నాయిక అంటే తప్పులేదు. భానుమతి పాత్రల్లోనూ, రచనల్లోనూ హాస్యం జాలువారుతుంటుంది. 'జానకీబాల' భానుమతి బహుముఖీన వ్యక్తిత్వాన్ని చక్కగా చిత్రిస్తూనే సినిమా పాటల బాణీలలో హిందీ చిత్రాలను అనుకరించారని సోదాహరణంగా వ్యాఖ్యానించారు.

జి.వరలక్ష్మి,ఎస్.వరలక్ష్మి కూడా తొలి తరం నాయికలలో పాడగలిగిన వారే. అయితే జి.వరలక్ష్మి కమ్యూనిస్టు ఉద్యమంలోనూ పాల్గొన్నారు. మంచి పాత్రలు వేసి మెప్పించారు. అయితే తర్వాతి కాలంలో పాడలేదు. ఎస్.వరలక్ష్మి మాత్రం భానుమతి లాగే పాడుతూ వచ్చారు. కాని ఆ స్థాయి నాయికగా నిలవలేదు. మీర్జాపురం రాజా వారిని చేసుకుని తెరకు దూరమైన నటి సి.కృష్ణవేణి. 1935లోనే సినిమా రంగ ప్రవేశం చేసి మెప్పు పొందినా పిఠాపురం రాజా వారిని చేసుకున్న కారణంగా గానానికి దూరమైన మరో తార ఆర్.బాలసరస్వతీ దేవి. 'దేవదాసు'లో చంద్రముఖి పాత్రకు ఆమె పాడిన పాటలు బాగా పాపులర్. లలిత సంగీతంతో మరింత ఎక్కువ పేరు తెచ్చుకున్నారు. కాని భర్త కారణంగా ప్రజా జీవితంలోకి పెద్దగా రావడానికి వీల్లేకపోయింది.

అలాగే భర్త గొప్ప దర్శకుడైనా ఆయన తగు ప్రాధాన్యతనివ్వకపోవడం వల్ల ప్రతిభ పూర్తిగా చూపలేకపోయిన నేటి శాంతకుమారి. నటిగా, గాయనిగా పేరు తెచ్చుకోవడమే గాక 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ', 'మాదీ స్వతంత్ర దేశం' వంటి పాటలతో దేశభక్తి ప్రతిధ్వనించిన ఘనత టంగుటూరి సూర్యకుమారిది. వీరందరినీ రచయిత్రి చక్కగా పరిచయం చేశారు.

తర్వాత పి.లీల. తెలుగు, కన్నడ మళయాళ, తమిళ, సింహళ భాషల్లో వేలాది పాటలు పాడిన లీల ఒక సంగీత కెరటం. ఘంటసాలను గురువుగా పేర్కొనే లీల ఆయనతో పాటు ఎస్.రాజేశ్వరరావు సంగీత దర్శకత్వంలోనూ అనేక గొప్ప పాటలు పాడారు. 1949లో మనదేశంతో మొదలుపెట్టి 1964 వరకూ ఆమె సినీ సంగీతాన్ని ఏలారు. తర్వాత దాన్ని సుశీలకు అప్పగించారు. ఈ మధ్యన మనకు జిక్కీ గొంతు ముగ్ధ మనోహరంగా వినిపిస్తోంది. 1943లో 'పంతులమ్మ' చిత్రంలో గూడవల్లి రామబ్రహ్మం చిన్న పాత్రలో పరిచయం చేసిన జిక్కి గొంతు 'చిగురాకులలో చిలకమ్మ' ను గుర్తు చేస్తుంటుంది. 'పిలవకురా', 'వూరుకో వే మేఘమాలా' వంటి పాటలన్నీ ప్రసిద్దాలే. ఆమెది కూడా పైన చెప్పుకున్న కొందరి కథలకు డిటో. ప్రముఖ గాయకుడు ఎ.ఎం.రాజాను పెళ్లి చేసుకోవడం ఆమె భవితవ్యానికి బందిఖానా అయింది. ఘంటసాలతో పోటీలో వెనకబడి పోయిన రాజా జిక్కిని పాడించాలంటే తననూ తీసుకోవాలన్న వాతావరణం సృష్టించడంతో ఆమెకు రావలసిన అవకాశాలు సుశీలకు పోయాయంటారు.

వాస్తవానికి సుశీల పైకి రావడానికి ఆమె ప్రతిభ కారణమైనంతగా మరో కారణం లేదు. ఆమెలా అంత సుదీర్ఘ కాలం ప్రథమ స్థానం చెలాయించిన వారు మరి లేరు. చిన్నప్పుడే సంగీతం నేర్చుకున్న సుశీల క్రమపద్ధతిలోనే సినిమాలలో ప్రవేశించారు. 'దొంగరాముడు' ఆమెకు బాగా పేరు తెచ్చింది. 'సంఘం' కూడా. పెండ్యాల ఆమెకు ప్రత్యేకంగా ప్రోత్సాహమిచ్చారు. 1950,60,70లలో సుశీల పాట లేని తెలుగు సినిమాలంటూ వుండవు. పాటల ద్వారా కీర్తి సంపద సమకూర్చుకోవడంపై తప్ప మరో వైపు మరలలేదు. ఆమెకు లెక్కలేనన్ని అవార్డులు వచ్చాయి.

మరో మధుర గాయని ఎస్.జానకి. 'ఎంఎల్ఏ' చిత్రంలో 'నీ ఆశా అడియాసా' సినిమాతో సినీ పాటల తోటలో ప్రవేశించిన జానకి నేటి వరకూ సంగీతామృతం వర్షిస్తూనే వున్నారు. పెండ్యాల, రాజేశ్వరరావుల సంగీతంలో ఆమె మరింత బాగా పాడగలిగారు. పై కొన్ని ఉదాహరణల్లో వలె గాక జానకి భర్త డా.రాంప్రసాద్ ఆమెకు వృత్తిలో అడుగడుగునా తోడు నిలవడం విశేషం. 'నీలి మేఘాలలో గాలి కెరటాలలో' నిరంతరం జాలువారే గానం జానకి.

ఇక ఆ తర్వాత రచయిత్రి జానకీ బాల మరికొందరు గాయనుల జీవిత రేఖలు సృశించారు. 'ముక్కుమీద కోపం' వంటి పాటలతో కొంటె తనం కురిపించింది జమునారాణి. హాస్య గీతాలకు మారుపేరైంది స్వర్ణలత. పలు విజయవంతమైన గీతాలాలపించిన బి.వసంత 'మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాల' అంటూ జానపదాన్ని నైట్‌క్లబ్బుల బాణీలో ఆలపించిన ఎల్లారీశ్వరి తదితరుల పాటలనూ జీవితపు బాటలనూ తెలియపర్చారు.

వాణీ జయరాంది మరో ప్రత్యేక కోవ. మొదట హిందీ సినిమాలలో వెలుగొంది తర్వాత దక్షిణాదికి తరలి వచ్చిన ఒకే ఒక గాయని ఆమె. 'దొరకునా ఇటువంటి సేవ' అంటూ సంగీత గంగా తరంగ నాదాలు వినిపించిన విశిష్ట గాయని. 'శంకరాభరణం, స్వాతి కిరణం, శ్రుతిలయలు' వంటి చిత్రాలతో పాటు 'పూజ'లో 'ఎన్నెన్నో జన్మల బంధం' వంటివి కూడా ఆమెను స్మరణీయురాలిని చేశాయి. ఎస్.పి.శైలజతో సహ మరికొందరి వివరాలు కూడా ఈ పుస్తకంలో జానకీ బాల పొందుపర్చారు.

కేవలం పాటలకే పరిమితం కాకుండా వారి వారి ప్రవేశం, ప్రకాశం వగైరాలను క్రమానుగతంగా విశ్లేషించేందుకు ఈ పుస్తకంలో జానకీ బాల చేసిన ప్రయత్నం బాగుంది. అలాగే ఎంతగా మెచ్చుకున్నా వారి లోపాలను కూడా ప్రస్తావించేందుకు వెనకాడలేదు. ఈ సంగీతావలకోసం లో వివికెరంగారావు, సంగీతరావు వంటివారి అభిప్రాయాలనూ సందర్భోచితంగా పొందుపర్చారు. మహిళలుగా వారు కుటుంబ జీవితంలో ఎదుర్కొన్న ప్రోత్సాహ నిరుత్సాహాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. మహిళల సమస్యలపై పనిచేసే అస్మిత సంస్థ ప్రచురణ గనక ఇది చాలా సహజం, సమర్థనీయం కూడా. ప్రజా జీవితంలోనూ కళా సాహిత్యాది రంగాలలోనూ రాణించిన మహిళల అనుభవాలు తెలుసుకోవడం కొత్త తరాలు అవగాహన చేసుకోవడానికి దోహదపడుతుంది. ఆ విధంగా ఈ పుస్తకానికి సామాజికమైన విలువ కూడా వుంది.

2003లో తొలి ముద్రణ వెలువడిన ఈ పుస్తకంలో ఫోటోలను మెరుగు పర్చే అవకాశం వుంది. అలాగే గాయనీ మణుల జీవితాలను వివిధ భాగాలుగా ఇచ్చివుంటే మరింత సౌలభ్యంగా వుండేది.

**కొమ్మా కొమ్మా కోకిలమ్మా**
**తెలుగు సినిమా**
**నేపథ్య గాయనుల జీవిత చిత్రాలు**
**ఇంద్రగంటి జానకీబాల**
**వెల: 75/-**
**పేజీలు: 154**
**ప్రతులకు:**
**అన్ని పుస్తక షాపులు.**






**సీరియల్**

మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

**జరిగినకథ:**

**ఏమైతేనేం, అది బిగ్‌స్నేక్ ఓడిన తొలి న్యాయపోరాటం. ఆతర్వాత, మళ్లీ అతడికిలాంటి అవకాశం కూడా రాలేదు. 'కార్న్ ఈజ్ ఇన్ సిల్క్ మూన్' సీజన్‌లో అతణ్ణి ఏజెన్సీకి తరలించాడు. త్వరలో ఈ తుంటరిని 'ఫినిష్' చేయమని పై నుంచి సంకేతాలు వచ్చాయి. శిక్షలు వేయాలంటే తదనుగుణంగా కేసు తర్వాత చేయాలి. 'బిగ్‌స్నేక్ మూలంగా ఇతర ఇండియన్లు కూడా శాసనోల్లంఘనకు పాల్పడుతున్నారని' రిపోర్టు పంపాడు వైట్‌మాన్. చీటికీ మాటికీ అతణ్ణి అవమానించి, తిట్టి, చంపుతామని బెదిరించారు గార్డులు. 'వీడికి ఫోర్ట్ రెనోలో జీవితఖైదువేద్దాం' అని కమిషనర్ ఆఫ్ ఇండియన్ అఫెయిర్స్ అనుమతి కూడా కోరాడు ఏజెంట్.**

# అమెరికన్ డేగ

**(60వ భాగం)**

**'మీ** యిష్టం చంపితే చంపండి' అంటూ కదిలాడు బిగ్‌స్నేక్. 'అదీ జరగొచ్చు' అన్నాడొక ఆఫీసరు. సంకెళ్లు వేయబోతే బిగ్‌స్నేక్ తిరగబడ్డాడు. నలుగురు సైనికులు అతడి మీదికి లంఘించారు. అందర్నీ వెనక్కు తోశాడు బిగ్‌స్నేక్. ఎన్నిసార్లు ప్రయత్నించినా సంకెళ్లు వేసుకోవడానికి సుముఖత చూపలేదు. మరో ఆరుగురు సైనికులు ప్రయత్నించారు. బిగ్‌స్నేక్ వాళ్లనూ తోసేశాడు. అప్పుడు, ఒక సైనికుడు తుపాకీ మడమతో బిగ్‌స్నేక్ మొహం మీద గట్టిగా కొట్టాడు. మరొకతను తలమీద బాదాడు. బిగ్‌స్నేక్ వెల్లకిలా పడిపోయాడు. మొహం నుండి నెత్తురు ధారగా కారింది. ఎవరో అతడి గుండెల మీద తుపాకీ పెట్టినొక్కారు. చూడలేక నేను మొహం పక్కకు తిప్పుకున్నాను. గన్ పేలింది. బిగ్‌స్నేక్ మరణించాడు.

'స్టాండింగ్‌బేర్ సోదరుడు బిగ్‌స్నేక్ దుష్టుడు. ప్రమాదవశాత్తు కాల్పుల్లో మరణించాడు' అంటూ ఇంటీరియర్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇండియన్ల పట్ల జరుగుతున్న అన్యాయాలను వెలికితీస్తున్న అమెరికన్ పత్రికలు 'కాంగ్రెస్‌లో విచారణ' జరిపించాలని పట్టుబట్టాయి. కానీ మిలిటరీ -పొలిటికల్ -రిజర్వేషన్ కాంప్లెక్స్ బలంగా ఉన్నంతకాలం ఏ విచారణలోనూ ఏమీ తేలదు.

'ఇండియన్ టెరిటరీ'లో అధికారుల ఆజ్ఞలను ధిక్కరించిన పొంకాలకిదో మంచి గుణపాఠం. సమాన పౌరహక్కులు అనేవి ఒక భ్రమ అని తెలిసింది. హక్కులన్నీ, అమెరికన్లకే. ఇండియన్లకు చట్టం వర్తించదు. షెయెనీల్లాగానే పొంకాలు కూడా రెండుగా చీలిపోయారు. స్వేచ్ఛాజీవితం గడిపిన స్టాండింగ్ బేర్ అనుచరులు, ఇండియన్ టెరిటరీలో బానిసలుగా గడిపిన ఇతరులు.

**16. యూట్ తెగ**

'సైన్యం, షెయెనీలను లొంగదీసుకుంది. మాకు వాళ్లతో సంబంధం లేదు. కాని, యూట్‌ల మీద ఎందుకు దాడి చేస్తున్నారు? మీ మాట విననంత మాత్రన మమ్మల్ని అణచివేస్తారా?"

**- యూట్‌ల నాయకుడు ఊరే (ది ఆరో)**

యూట్ తెగల మధ్య చిచ్చు పెట్టారు తెల్లవాళ్ళు. దానికి నిరసనగా, వైట్ రివర్ యూట్‌ల నాయకుడు నికాగట్ (జాక్) యిచ్చిన వాగ్మూలం.

"ఇది కపటనీతి. కమిషనర్ ఇంత నీచానికి ఒడిగట్టగూడదు. మా సోదరులను మేమెందుకు చంపాలి? ఒక్క తల్లికి పుట్టిన అమెరికన్లు రక్త సంబంధం మరిచి యుద్ధం చేస్తారని చెప్పారువాళ్ళు".

యూట్ ఇండియన్ల నివాసస్థలం రాకీ మౌంటెన్స్, మిడదల దండులాగ వచ్చిన తెల్లవాళ్ళు కొలరాడో పర్వత ప్రాంతంలోని వనరుల్ని దోచుకోవటం చూస్తే చాలా సంవత్సరాలుగా వుపేక్షించారు. ఆ మైదానాలలో నుండి తమ బద్ధ శత్రువులైన షెయెనీలను తరిమేసినందుకు సైనికులను అభినందించారు కూడా. కొందరు యూట్ యోధులు, రోప్ త్రోవర్ (కిట్ కార్సన్)తో చేతులు కలిపి నవాహోలతో యుద్ధాలు చేశారు. ఆ రోజుల్లో, తెల్లవాళ్ళు తమ మిత్రులే అని భ్రమపడ్డారు యూట్‌లు. డెన్వర్ నగరానికి ప్రయాణం చేసి, అక్కడ దున్నల చర్మాలకు అమ్మి చవకబారు వినియోగవస్తువులు కొనుక్కోవటం వాళ్లకో వినోదం. కాని త్వరలోనే పరిస్థితి మారింది. ఏడాది ఏడాదికీ తెల్లవాళ్ల సంఖ్య పెరిగింది. యూట్‌ల పర్వత ప్రాంతాల్లో బంగారం, వెండికోసం తవ్వకాలు కూడా ప్రారంభించారు.

1863లో, కొలరాడో టెరిటరీ గవర్నర్ జాన్, ఎవాన్స్, ఇతర అధికారులతో సాన్ యువాన్ పర్వతాల్లోని కోనెహోస్ గ్రామానికి వచ్చి యూట్ నాయకులతో అందులో ముఖ్యుడు ఊరే ది ఆర్రో చర్యలు జరిపాడు. అందరూ స్నేహపూరిత వాతావరణంలో మాట్లాడుకున్నారు. ఒక ఒప్పందం మీద సంతకాలు కూడా చేసుకున్నారు. దాని ప్రకారం, పర్వతాలకు తూర్పువైపు (కాంటినెంటల్ డివైడ్) వున్న నేలంతా తెల్లవాళ్లకూ, పశ్చిమ ప్రాంతం యూట్‌లకూ చెందుతుంది. అక్కడ, అమెరికన్లు స్వేచ్ఛగా తవ్వకాలు జరుపుకోవచ్చు. స్త్రీలు, పిల్లలకు ఏ అపకారమూ తల పెట్టమని హామీ ఇచ్చారు. యూట్‌లు దీనికి ప్రతీగా, పదేళ్ళపాటు సాలీనా ఇరవై వేల డాలర్ల విలువ గల వస్తువులూ, భోజన పదార్థాలూ వాళ్లకు లభిస్తాయి. అయితే, అయిదేళ్లు గడవకుండానే, యూట్‌లకు చాలా ఎక్కువ భూభాగం మీద హక్కులు కల్పించామని పశ్చాత్తాప పడ్డారు. కొలరాడో మైనర్లు. తమ తవ్వకాలకు ఈ ఆటవికుల్లో "న్యూసెన్సు"గా తయారైనారని ఇండియన్ బ్యూరోకు ఫిర్యాదు చేశారు." ఇండియన్లు మా గుర్రాలనూ, పశువుల్నీ దొంగిలిస్తున్నారు". అందువలన వీళ్లను రిజర్వేషన్‌లో పెడితే తప్ప సమస్య పరిష్కారం

కాదు. యూట్‌ల పర్వత ప్రాంతమంతా తమకే చెందాలన్నది అసలు కోరిక. 1868, అట్టహాసంగా, ఊరే, నికాగల్ మరో ఎనిమిది మంది నాయకుల్ని వాషింగ్టన్‌కాహ్వానించింది ఇండియన్ బ్యూరో. "మిత్రుడు, సలహాదారు" రోప్ త్రోవర్ కార్సన్ కూడా వాళ్ళ ననుసరించాడు. అక్కడ, అందరికీ మంచి హోటల్లో బస ఏర్పాటు చేశారు. రుచికరమైన భోజనం, పొగాకు, మిఠాయిలు, మెడల్స్‌తో (దుస్తుల మీద అలంకరించుకోవటానికి) ఇండియన్లను మచ్చిక చేసుకోవటానికి ప్రయత్నాలు కూడా జరిగాయి.

అక్కడికి వెళ్లిన నాయకులందరూ ఒక్కొక్క వుప తెగలకు ప్రతినిధులు. అందువలన, ఒప్పందం మీద సంతకాలు పెట్టేముందు, వాళ్లు తమ అనుచరుల తరఫున కూడా అంగీకారం తెలిపినట్టే అన్నారు. అధికారులు. "ఊరే ది ఆరో" నాయకత్వంలోనే మిగతా మిగతావు తెగలూ రాకీల్లో సంచరిస్తాయి. అంటే అందరికీ అతడే ప్రతినిధిగా కూడా వ్యవహరించవచ్చు. ఊరే అందగాడు. ఆపాచీ-అన్ కంపాగ్ర్ తెగల మిశ్రమ సంతాపం. గుండ్రటి మోహం, మెరిసే కళ్లతో అందర్నీ ఆకర్షిస్తాడు. ఇంగ్లీష్, స్పానిష్ ధారాళంగా మాట్లాడగలిగిన అతి కొద్ది ఇండియన్లలో ఒకడు. అక్కడి అధికారులు, ఒప్పందం కోసం, తన మీద ఒత్తిడి తెచ్చినప్పుడు, పత్రికల వాళ్లతో ఇలా మొరలు పెట్టుకున్నాడు." ఇండియన్లు, యునైటెడ్ స్టేట్స్‌లో సంధి చేసుకోవటమంటే వేటగాడి బాణాలకు నేల గూలిన జంతువు అతడితో సంధి చేసుకున్నట్టే.

మాకు మరో అవకాశం లేదు. వాళ్ళు ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడే పెడతాం."

వాషింగ్టన్‌లో రాజకీయచతురుల మాటలగారడీ, సరిహద్దుల గురించిన 'దౌత్య పరిభాష' ఊరే మీద ప్రభావం చూపలేదు. ప్రభుత్వం ఇస్తానన్న కొద్దిపాటి జనానికి బదులు పదహారు మిలియన్ ఎకరాల పర్వత ప్రాంతం, అరణ్యాలు, మైదానాల మీద హక్కు తనకే వుండాలని వాదించాడు (ఇది యోట్‌లు పోగొట్టుకున్న దాని కన్నా తక్కువే, కాని అధికారులు ప్రతిపాదించిన దాని కన్నా చాలా ఎక్కువ). రెండు ఏజెన్సీలు అవసరమవుతాయి. ఒకటి అన్ కంపాగ్రల కోసం లాస్ నైనోజ్ వద్ద, మరొకటి వైట్ రివర్ వద్ద ఇతర తెగల కోసం. ఒప్పందంలో తమ రక్షణ కోసం కొన్ని అదనపు షరతులు కూడా డిమాండ్ చేశాడు ఊరే. యూట్‌లకు కేటాయించిన భూభాగంలోకి అనధికారంగా ఏ తెల్లవాడుకూడా ప్రవేశించకూడదన్నది అందులో ముఖ్యమైనది.

ఒప్పందం మీద సంతకాలైతే జరిగాయి గాని మైనర్లు, మొదటి రోజు నుండే అన్ని షరతులనూ వుల్లంఘించారు. అందులో ఒకడు ఫ్రెడరిక్ డబ్ల్యు. పిట్కిన్. ఈ న్యూ ఇంగ్లండు యాకీ సాన్ యువాన్ పర్వతాల్లోకి ప్రవేశించి, వెండి గనులన్నీ ఖాళీ చేశాడు. 1872లో ఇతడు, సాన్ యువాన్ ప్రాంతం యూట్ రిజర్వేషన్‌లో నాల్గోవంతు-కొలరాడో టెరిటరీలో భాగమని ధనికమైనర్ల తరఫున వాదించాడు. ప్రముఖ వ్యక్తుల ప్రయోజనాలకు

యూట్స్ ప్రాంతం, అమెరికాలోనే అత్యంత సారవంతమైన నేల. అక్కడి పచ్చటి మైదానాలు, సమృద్ధిగా వున్న పశు సంపద, వివిధ ఫల జాతులు, అనేక రకాల దుంపలు, గింజలు ఎంత జనాభాకైనా చిరకాలం ఆహారం అందించగలవు. ప్రకృతి ప్రసాదించిన స్వర్గమిది. లాస్‌పైనోస్, వైట్ రివర్‌ల (వద్ద ఆఫీసు లేర్పరుచుకున్న) ఏజెంట్ల దయాధర్మాల మీద ఆధార పడవలసిన అవసరం లేదు. వాళ్లకు రేషన్ల అవసరం లేదు. 1875లో, లాస్ పైనెస్ ఏజెంట్ ఎఫ్.ఎఫ్. బాండ్ యూట్‌ల జనాభా సేకరణ జరపాలన్న సలహాకిలా స్పందించాడు."

అనుకూలంగానే ఏ ప్రభుత్వమైనా నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ రిజర్వేషన్ మీద హక్కుల కోసం సంప్రదింపులు జరపమని, ఫెలిక్స్ ఆర్. బ్రూనో నాయకత్వంలో ఒక స్పెషల్ కమిషన్‌ను నియమించింది ఇండియన్ బ్యూరో.

1873 సెప్టెంబర్‌లో, లాస్ పైనోస్ వద్ద ఊరే ఇతర నాయకులతో సమావేశం జరిపింది. బ్రూనో కమిషన్ చర్చల సందర్భంగా, గ్రేట్ ఫాదర్ స్వయంగా అన్ని నిర్ణయాలు తీసుకుంటాడని బుకాయించారు. రిజర్వేషన్‌లోని కొంత భూభాగం తమకు కావాలి. "మనకోసమే కాదు. రాబోయే తారలను దృష్టిలో పెట్టుకొని మనం ఒప్పందాలు చేసుకోవాలి. మీ పిల్లలు, మా పిల్లల క్షేమం కోరి సంతకాలు పెట్టమంటున్నాం. ఆలోచించుకోండి" అంటూ ఇండియన్లను ఇరకాటంలో పెట్టాడు బ్రూనో.

ఉన్న భూమి వదులుకుంటే తమ పిల్లల భవిష్యత్తు ఎలా బాగుపడుతుందో ఇండియన్ నాయకులకు అంతుపట్టలేదు. బ్రూనో రకీమని సమాధానం చెప్పాడు. "ప్రభుత్వం ఈ భూమిని పెద్ద మొత్తానికి కొనుక్కుంటుంది. ప్రతి సంవత్సరం దాని మీద వడ్డీ కూడా చెల్లిస్తారు"

"మీరు వడ్డీ చెల్లించక్కర్లేదు. ఆ డబ్బు మా పేర బ్యాంకులో వెయ్యండి" అన్నాడు ఊరే. కాని ఒప్పందమెప్పుడూ అమలు కాదే. తెల్లవాళ్ళు పర్వతాల్లోకి రావద్దని ఒక షరతు విధించుకున్నారు. కాని ఏమైంది.? రోజూ యధేచ్ఛగా ఇక్కడ తిరుగుతూనే వున్నారే?

మైనర్ల రాకపోకలకు ఆటంకం కలిగిస్తే వాళ్ళు యుద్ధం చేస్తారేమోనని ప్రభుత్వం సందేహిస్తున్నది. అప్పుడు యూట్‌లు ఏ పరిహారం లేకుండానే భూమిని వదులు కుంటారు. ఎందుకీ చిక్కులన్నీ ? అమ్మేసుకుంటే సమస్య తీరుతుంది గద!

"మైనర్లు చట్టాన్ని గౌరవించారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధిక్కరించినా వాళ్లంటే మీరు గొప్ప గౌరవమే. ఎవరి దారి వాళ్లదే అనుకుంటే సంధులు కుదుర్చుకోవడమెందుకు?" అన్నాడు ఊరే.

"పర్వతాలను అమ్మితే మీకేమీ నష్టం లేదు. వాటిలో బంగారం దొరక్కపోతే మీకో లాభం మాకో నష్టం- 'మాకు' అంటే మైనర్లకు బంగారం లేదు గనక వాళ్ళు ఇటు వైపు రావటం మానేస్తారు. మీకు మాత్రం బోలెడంత డబ్బు మిగుల్తుంది" అంటూ వాదించాడు బ్రూనో.

"ఒప్పందం' కాసేపు పక్కన పెట్టండి. మొదట వాళ్లు ఇటు వపు రాకుండా నిరోధించండి. ప్రభుత్వం అంత బలహీనంగా వుందా?" అంటూ ప్రశ్నించాడు ఊరే.

"ఆపటం అసాధ్యమేమీకాదు. కాని కష్టమని మీకు తెలుసు" అన్నాడు బ్రూనో.

"గనులున్న ప్రాంతం అమ్ముతాంగాని వేట మైదానాలు మాత్రం మాకే కావాలి" అన్నాడు ఊరే.

"బంగారం ఎక్కడ దొరుకుతుందో నిక్కచ్చిగా చెప్పలేం. భూమిలో ఒక భాగం మాత్రమే కొనటం వీలుపడలేదు. అంతేకాదు ఇప్పుడున్న మైనర్లను తరిమేసినా కొత్త వాళ్ళు రారని నమ్మకమేమిటి?" అన్నాడు బ్రూనో.

ఏడు రోజుల చర్చల తర్వాత, నాలుగు మిలియన్ ఎకరాల 'బంగారు' భూమికి ఇరవై అయిదు వేల డాలర్లు చెల్లించటానికి ఒప్పందం కుదిరింది. సంధికి సహకరించినందుకు గాను, ఊరేకు పదేళ్లపాటు సాలీనా వెయ్యి డాలర్ల బోనస్ కూడా చెల్లిస్తారు (లేదా-అతడు యూట్‌ల నాయకుడుగా వున్నంత కాలం). మొత్తం మీద, సంవత్సరాల తరబడి తెల్లవాళ్లను ప్రతిఘటించిన ఊరే, ప్రభుత్వ సమర్థకుడిగా మారిన వైనమిది!

యూట్స్ ప్రాంతం, అమెరికాలోనే అత్యంత సారవంతమైన నేల. అక్కడి పచ్చటి మైదానాలు, సమృద్ధిగా వున్న పశు సంపద, వివిధ ఫల జాతులు, అనేక రకాల దుంపలు, గింజలు ఎంత జనాభాకైనా చిరకాలం ఆహారం అందించగలవు. ప్రకృతి ప్రసాదించిన స్వర్గమిది. లాస్‌పైనోస్, వైట్ రివర్‌ల (వద్ద ఆఫీసు లేర్పరుచుకున్న) ఏజెంట్ల దయాధర్మాల మీద ఆధార పడవలసిన అవసరం లెదు. వాళ్లకు రేషన్ల అవసరం లేదు. 1875లో, లాస్ పైనెస్ ఏజెంట్ ఎఫ్.ఎఫ్. బాండ్ యూట్‌ల జనాభా సేకరణ జరపాలన్న సలహాకిలా స్పందించాడు.

**ఇంకా వుంది....**

# నాన్నగారిది ఓ విచిత్రమైన జీవితం





చందు

తెలుగు ప్రేక్షకులు తెలివైనవాళ్ళని చెబుతుంటారు. సినిమా బాగుంటే... ముక్కూమొహం తెలీని హీరోహీరోయిన్లు నటించిన లో బడ్జెట్ చిత్రానికీ బ్రహ్మరథం పడతారు. మంచిగా లేకుంటే... అగ్ర హీరోల సినిమాలను సైతం తిరస్కరిస్తారు. ఇటీవల విడుదలై శతదినోత్సవం పూర్తి చేసుకున్న 'గమ్యం'లో అన్ని పాత్రలకూ మంచి గుర్తింపు వచ్చింది. జన జీవన స్రవంతిలో కలిసిన మాజీ నక్సలైట్ నటన, అతని డైలాగ్ మాడ్యులేషన్ విశేషంగా ఆకట్టుకుంది. ప్రేక్షకులకు ఇతని పేరూ తెలీదు... ఊరూ తెలీదు... కానీ బాగా చేశాడంటూ ప్రశంసించారు. ఇతనెవరో కాదు... 'రావుగోపాలరావుగారి అబ్బాయి' రావు రమేష్ అని చెబితే... 'అలానా!' అంటూ ఒకింత ఆశ్చర్యానికి గురవుతారు. తండ్రి నటనను అనుకరించకుండా, తనకంటూ ప్రత్యేక శైలి ప్రదర్శించినందుకే ఆ ఆశ్చర్యం. తండ్రి పేరు చెడగొట్టకుండా వైవిధ్యభరితమైన పాత్రలు పోషిస్తానంటున్న 'రావు రమేష్'తో ఈవారం....

**నా**న్నగారి పేరు చెప్పగానే వెంటనే గౌరవమిస్తున్నారు. ఇంతకు మించిన ఆస్తి ఏముంటుంది? ఎన్నో ఏళ్లు కష్టపడి తపస్సు చేస్తే వచ్చే గౌరవం, నాన్నగారి పేరు చెప్పగానే ఇస్తున్నారు. ఒక మచ్చ కూడా లేకుండా బతికితేనే ఇలాంటి గౌరవం సాధ్యం. అందుకే ముందు నాన్నగారి గురించి మాట్లాడుకుందాం....

నాన్నగారిది ఓ విచిత్రమైన జీవితం. రామ్ మనోహర్ లోహియా, మద్దూరి అన్నపూర్ణయ్య, గండికోట జోగినాథం, జయప్రకాష్ నారాయణ్... వంటి మహనీయుల ఆశయాలు, ఆదర్శాలు నాన్నగారిపై ప్రభావం చూపాయి. వీరి ఉద్వేగభరిత, విప్లవాత్మక ప్రసంగాలను నాన్నగారు అమితంగా ఇష్టపడేవారు. అలాగే సాహితీవేత్తలతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. అందుకేనేమో! ఆయనకు చిన్న వయసులోనే భాష మీద మంచి పట్టు సాధ్యమైంది.

## భయంతో కూడిన భక్తి

మా తరం వచ్చేటప్పటికి జమిందారీ వ్యవస్థ పోయిందిగానీ మా తాతగారు పెద్ద జమిందారు. ఆయన ఎదురుపడ్డారంటే నాన్నగారు అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయేవారు. 'భయంతో కూడిన భక్తి' అన్న మాట. మా తరందీ అదే తీరు. ప్రేమ, అనుబంధం... అన్నీ ఉంటాయి. కానీ ఎందుకో 'భయంతో కూడిన భక్తి'. నాన్నగారు ఇంట్లోకి వస్తున్నారంటే... ఏదో బయటి మనిషి వస్తున్నట్టు కుర్చీల్లోంచి లేచి వెళ్ళిపోయేవాళ్ళం.

నాన్నగారు, నేనూ మాట్లాడుకుంది టోటల్ లైఫ్‌లో ఒక పేజీ డైలాగ్స్ కూడా ఉండవు. నాన్నగారు నన్ను 'నాన్న... నాన్న...' అని చెల్లిని 'అమ్మ... అమ్మ...' అని పిలిచేవారు. తమ్ముణ్ణి మాత్రం 'క్రాంతి' అని పేరు పెట్టి పిలిచేవారు. ఎందుకంటే ఆ పేరంటే ఆయనకంత ఇష్టం. మద్దూరి అన్నపూర్ణయ్యగారి స్ఫూర్తితో తమ్ముడికి ఆ పేరు పెట్టారు. అన్నపూర్ణయ్యగారు కమ్యూనిస్టు. కమ్యూనిస్టంటే విప్లవం. అందుకే ఆయన ప్రేరణతో తమ్ముడికా పేరు పెట్టారు.

## మాది '24 గంటల వంట గది'

మా ఇంట్లో ఎప్పుడు చూసినా నిత్య సమారాధనే. రోజుకి 40 నుంచి 70 మంది దాకా భోజనం చేసేవారు. రోజూ ఫంక్షన్ వాతావరణంలా ఉండేది. ఎవరు వస్తున్నారో తెలీదు. ఎవరు వెళ్తున్నారో తెలీదు. మాది '24 గంటల వంట గది'. వేళకాని వేళలో టీ అడిగినా... మజ్జిగ అడిగినా... సిద్ధం చేయడానికి వంట గది రెడీగా ఉండేది. నాన్నగారు ఎప్పుడు ఏం అడిగినా విసుక్కోకుండా ఆయన సేవే తన పరమావధిగా అమ్మ సేవలు చేస్తుండేది. నిజంగా అమ్మ చాలా గ్రేట్. అమ్మ హరికథా ఆర్టిస్ట్. స్టేజ్ మీద సుమారు 14 వేల ప్రోగ్రాములు ఇచ్చింది. వీరిది ప్రేమ వివాహం. ఇద్దరికీ పుస్తక పఠనం అంటే ఇష్టం. 'మీరీ పుస్తకం చదివారా?' అని ఒకరినొకరు అడుగుతుండేవారు. పుస్తకాలు చదవడమే వారి ప్రేమ.. ఆనందం.

## ఎస్వీఆర్ చేతుల మీదుగా తిలకం దిద్దించుకున్నారు

నాన్నగారు చిన్నప్పటి నుంచే నాటకాలు ఆడేవారు. అలాగే డైరెక్షన్ చేసేవారు కూడా. ఈక్రమంలో రాత్రంతా నిద్ర పోయేవారు కాదు. మిక్చర్ తింటూ... ఓ వంద టీలు తాగడంతో రాత్రి గడిచిపోయేది. నాన్నగారికి దర్శకత్వమంటేనే ఎక్కువ ఇంట్రస్ట్. సినిమాల్లోకి రాకముందు నుంచే ఆయనకు నాటక కళా పరిషత్‌లో మంచి పేరుంది. అందరూ 'గురువుగారు' అంటూ పిలిచేవారు. నాటకాల్లో పడిపోయి ఊళ్ళు తిరుగుతూ పది పదిహేను రోజులు ఇంటికొచ్చేవారే కాదు. ఓసారి 'కీర్తిశేషులు' నాటకాన్ని దర్శకులు రామినీడుగారు, ఎస్వీ రంగారావుగారు కాకినాడలో చూశారు. రామినీడుగారు నాన్నగారికి సినిమాల్లో నటించే అవకాశం ఇచ్చారు. 'నటించే ఉద్దేశం లేదండీ... నా దృష్టి అంతా డైరెక్షనే' అంటూ ఛాన్స్ వదులుకున్నారు. పోనీ అసోసియేట్ డైరెక్టర్‌గా చేద్దురు... రండంటూ తీసుకెళ్ళారు. యాక్టింగ్ వద్దు... వద్దు... అనుకున్న టైంలో 'భక్తపోతన'లో సింగనామాత్యులుగా నటించారు. ఇందులో ఎస్వీ రంగారావుగారు శ్రీనాథుడు. తన కావ్యాన్ని సింగనామాత్యులుకు అంకితమివ్వాలి. 'ఎవరికి పడితే వారికి అంకితమివ్వను... ఆ పాత్రలో రావుగోపాలరావుగారు నటిస్తేనే చేస్తాను' అని ఎస్వీ రంగారావుగారు అన్నారు. రంగారావుగారు తిలకం దిద్దితేనే నటిస్తానని నాన్నగారు అన్నారు. దీంతో తొలిషాట్‌లో రంగారావుగారు నాన్నగారికి తిలకం దిద్దే సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఆ తర్వాత 'జగత్ కిలాడీలు', 'జగత్‌జెట్టీలు' చిత్రాల్లో నటించారు. 1975లో 'ముత్యాలముగ్గు' విడుదలైంది. ఇక ఆయన గురించి అందరికీ తెలిసిందే.

మరిన్ని కబుర్లు... వచ్చేవారం....

## ఆ ఇల్లు మాకు దక్కదా?

మా నాన్నగారు వైజాగ్‌లో ఒక ప్లాట్ తీసుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఆరు లక్షలు చెల్లించారు. అగ్రిమెంట్ రాసుకున్నారు. ఇంకా మూడు లక్షలు చెల్లించాలి. అదే రోజు నుండి మేం ఆ ప్లాట్‌లోనే ఉంటున్నాం. మాకు అమ్మిన వ్యక్తి మళ్లీ డబ్బుకు రాలేదు. మేం రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. అతడి కోసం చూసి చూసి కోర్టులో రిజిస్ట్రేషన్ కోసం దావా వేశాం. అయినా అతడు అడ్రస్ లేదు. ఎక్కడికి వెళ్లాడో తెలియలేదు. ఈ మధ్యలో బ్యాంకు వాళ్లు వచ్చి ఇది ఐదు లక్షలకు మా బ్యాంకులో తాకట్టు ఉన్నదని ఇల్లు జప్తు చేస్తామని చెప్పారు. తాకట్టు పెట్టిన ఇంటిని మేం కొన్నాం. మమ్మల్ని మోసం చేసి ఇల్లు అమ్మాడు. ఇప్పుడు ఆ ఇల్లు మాకు దక్కదా? వివరంగా తెలుపగలరు?

కమల, ఖమ్మం

ఓనర్ మమ్మల్ని మోసం చేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. మీరు ఇల్లు కొనాలనుకున్నప్పుడు రిజిస్ట్రేషన్ ఆఫీసుకెళ్లి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ ఇ.సి. తీసి ఉంటే విషయం మీకు అర్థమయ్యేది. ఇల్లు కాని ఏదైనా స్థిరాస్తి కాని కొనదలచినప్పుడు ఇది తప్పని సరి. మీరు ఈ పాటికే కోర్టులో దావా వేశారు. కావున బ్యాంకుని కూడా ఇంప్లీడ్ చేయండి. మీరు కట్టవలసిన డబ్బులు ఎలాగూ ఉన్నవి కావున అవి కోర్టు ద్వారా బ్యాంకుకు కట్టండి. మిగతా డబ్బులు కూడా మీరు కట్టవలసినదే. బ్యాంకు డబ్బులు క్లియర్ చేస్తేనే మీరు పూర్తి హక్కులు పొందగల్గుతారు.

## జప్తు కొంత కాలం ఆపలేమా?

మా స్నేహితురాలి సమస్య ఏమనగా బ్యాంకు లోను ద్వారా అపార్టుమెంటులో ఇల్లు తీసుకున్నారు. నెలకు రూ **2500/-** కట్టాలి. గత **13** నెలలుగా కట్టలేకపోతున్నారు. ఆర్థికంగా అనుకోకుండా చితికి పోయారు. బ్యాంకు వాళ్లు వారం రోజుల్లో కట్టకపోతే జప్తు చేస్తామని లీగల్ నోటీస్ పంపించారు. వారి ఇల్లు జప్తు అవుతుందా? ఏలాగైనా కొంత కాలం ఆపలేమా? ఇంకా ఐదు సంవత్సరాల వరకు వారు కట్టుకునే అవకాశం ఉంది. ఇప్పుడే మొత్తం కట్టమంటే కష్టం కదా. ఈ సమస్య నుండి బయట పడటం ఎలా?

ఓ సోదరి, వైజాగ్.

అప్పు తీసుకున్నప్పుడు ప్రతి నెల కట్టవలసిందే కదా. ప్రతి నెలా కిస్తీ కట్టకపోతే మీరు అగ్రిమెంట్‌ను బ్రేక్ చేసిన వారవుతారు. కండిషన్స్ ప్రకారం ఒక నెల కట్టకపోయినా ముందు సంవత్సరాల కిస్తీ కూడా కలిపి అప్పటి వరకు మీరు చెల్లించ వలసిన మొత్తాన్ని వారు అడిగే హక్కు వారికి ఉంటుంది.

తక్షణం మీరు సదరు బ్యాంకు వారి వద్దకెళ్లి కొంత అమౌంట్ చెల్లించాలి. మిగతా దానికి సమయం అడగండి. వారు సమయం ఇస్తారు. కాకపోతే కొంత అపరాధ రుసుము చెల్లించ వలసి వుంటుంది.



**జి. ఎల్. నరసింహారావు**
హైకోర్టు న్యాయవాది, 9848994240



# చార్లీ చాప్లిన్ ఆట

**హా**య్ పిడుగులూ... ఏంటి స్కూలుకి డుమ్మా కొట్టకుండా రోజూ వెళుతున్నారా! వెరీగుడ్. ఇవాళ ఎటూ ఆదివారమే కాబట్టి నవ్వు తెప్పించే ఆట గురించి చెప్పకుందామా! ఇంతకీ ఆట పేరేంటంటే... 'చార్లీ చాప్లిన్ ఆట'. ఆడేవాళ్లకే కాక చూసేవాళ్లకు కూడా నవ్వొస్తుంది. మరి ఆలస్యం ఎందుకు... మొదలెట్టేద్దామా!



ఆడిస్తాం

**ఆటాడేవాళ్ల వయస్సు:**
8-10 సంవత్సరాలు

**అవసరమైనవి:**
రెండు కర్రలు, పెద్ద బంతులు

**ఎలా ఆడాలంటే...**

ముందుగా పిల్లలంతా రెండు గ్రూపులుగా విడిపోవాలి. తర్వాత రెండు గ్రూపుల మధ్య రెండు గీతలు గీసుకోవాలి. ఈ రెండు గీతల మధ్య 15 అడుగుల దూరం వుండాలి. ఇప్పడు ఒక్కో గ్రూపులోంచి ఒక్కొక్కరు ముందుకు రావాలి. వీరు ఒక చేతిలో కర్ర పట్టుకొని.. రెండు కాళ్ల మధ్య బంతి పెట్టుకుని ఒక గీత దగ్గర నుంచి రెండవ గీత దగ్గరకు వెళ్లాలి. అలా ఎవరు ముందు గీత దగ్గరకు చేరుకుంటే వాళ్లు గెల్చినట్టు. బాల్ పడకుండా జాగ్రత్తపడుతూ, మెల్లగా ముందుకు నడుస్తుంటే భలే నవ్వొస్తుంది చూసేవాళ్లకు. ఆడేవాళ్లకూ మజాగానే వుంటుంది. ఏంటి! చెయ్యి అడ్డం పెట్టుకుని మరీ నవ్వుకుంటున్నారు! ఆట గురించి చెప్తుంటేనే ఇంత నవ్వొస్తుందికదా. మరి ఆడి చూడండి ఇంకెంత నవ్వొస్తుందో?

- సాహిల్

# చుక్కల్లో చిన్నది



# తేడాలు చెప్పకోండోచ్

**నే**స్తాలూ! ఈ రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నా సరిగ్గా ఆరు తేడాలున్నాయర్రా. మీరేం చేయాలంటే వాటిని గుర్తించి చకచకా సున్నా చుట్టాలి. తర్వాత మా సమాధానం చూడండే.

ఆన్సర్: అమ్మాయి చెవి రింగు, పిల్లి మీసాలు, అమ్మాయి కూర్చున్న స్టూలు కాలు, కుక్క తోక, అమ్మాయి కన్ను, అమ్మాయి చొక్కా, చేతి మీద గీత.

# కనిపెట్టండే

**నే**స్తాలూ... ఈ చెట్టులో కొన్ని అక్షరాలున్నాయి కదా. అందులో చెట్లకు సంబంధించి పది పదాలున్నాయి. అయితే అవి అంత సులభంగా కనిపించవర్రా. కాస్త కష్టపడాలి. ఎలాగంటే...ఆ అక్షరాల్లో అడ్డంగా, నిలువుగా, కింది నుంచి పైకి, పై నుంచి కిందికి వెతికి చూడండి. ఆ పదాలేంటంటే....

BARK, BRANCH, LEAF, MAPLE, OAK, PALM, PINE, ROOT, SEED, WOOD.



| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Q | J | X | L | E | M | U | O | M | N | R | F |
| A | T | S | L | E | D | B | J | V | E | D | O |
| B | I | P | M | Q | A | A | B | K | P | P | I |
| Z | A | W | O | O | D | F | A | M | N | X | C |
| M | E | N | I | P | W | O | R | L | L | E | N |
| Y | X | F | R | N | D | E | A | M | H | A | G |
| D | M | G | O | W | U | B | I | W | C | W | P |
| H | K | B | O | F | A | S | D | W | N | D | X |
| S | H | X | T | R | M | K | U | F | A | E | P |
| Y | Z | L | K | Q | T | D | S | A | R | E | J |
| C | T | M | N | F | S | O | J | R | B | S | Q |
| M | A | S | T | H | P | O | U | B | L | M | V |



# దారి కనుక్కోండి

# బేళ్లకు రంగులు పులిమేద్దాం





# ఎక్కడున్నాయబ్బా...

**ఇ**దిగో పిల్లలూ! ఈ బొమ్మ చూశారుగా. ఇందులో ఎనిమిది ప్రాణులున్నాయి. కాకపోతే అవన్నీ గీతల్లో కలిసిపోయాయి. మీరు వాటిని వేటాడాలి. అంటే కనిపెట్టాలన్నమాట. ఇంతకీ అవేంటంటే... రెండు పక్షులు, పాము, తాబేలు, కప్ప, కోతి, సీతాకోకచిలుక, ఆర్మడిల్లో.

అట్టమీది కథ

# 'అందం'కోసం ఆరాటం

కాకర్లమూడి విజయ్

సహజంగా వచ్చిన శరీరం మనకి సంపూర్ణంగా ఎప్పుడూ ఇష్టం ఉండదు. ఇంకొంచెం మారితే బావుంటుందనీ, ఇంకాస్త 'ఇలా', 'అలా' ఉంటే బావుండేదనీ అనుకోని వాళ్ళు అరుదు. ఆ అనుకునే వాళ్లలో కొంత మంది 'అలా' మారేందుకు ప్రయత్నాలు కూడా చేస్తుంటారు. అయితే వాళ్లలో కొంతమంది మాత్రమే సఫలమౌతుంటారనుకోండి. అది వేరే విషయం. కానీ ఈ ధోరణి ఇప్పటిది కాదు. కొన్ని వందల సంవత్సరాల క్రితం నుంచే వుంది. అటువంటి విచిత్రమైన కొన్ని ఆలోచనలు, అనుకరణలు, ఆచారాల గురించి ఈవారం చెప్పుకుందాం.

కృత్రిమంగా జుట్టుని ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవడం, గరుకుగా ఉన్న ముఖాన్ని రకరకాల యాసిడ్లు పూసి నునుపుగా చేయించుకోవడం, ఉన్న వెంట్రుకలను తీయించుకోవడం, విచిత్రమైన కాంటాక్ట్ లెన్సులు పెట్టుకోవడం.... ఇలాంటివెన్నో ఈ రోజుల్లో అనునిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఉన్నదానికన్నా 'అందంగా' తయారవ్వడానికి ఇటువంటివి సామాన్యమే. కాని ఇవి ఈనాటివి కాదు. దశాబ్దాల క్రితం నుండి కూడా అందం పేరుతో ఎన్నో రకాలుగా శరీరాన్ని మార్పు చేసుకోవడం జరుగుతూనే ఉంది. అయితే ఎప్పుడు ఎటువంటి 'ఫ్యాషన్' జోరుగా ఉంటుందో అప్పుడు అటువంటి మార్పులు జరుపుకోవడం ఆనవాయితీగా ఉండేది. ఈ ఆనవాయితీలు కొన్ని సందర్భాలలో ఆచారంగా కూడా ఉండేవి.

## చిన్ని పాదాలు

పదవ శతాబ్ది ప్రాంతంలో చైనాలో ఒక ఆచారం ఉండేది. ఆడవాళ్ల పాదాలను చిన్నతనం నుండే కట్టేసి వాటిని చిన్నగా, విచిత్రంగా చేయడం చాలా దశాబ్దాల పాటు ఆచారంగా ఉంది. సాధారణంగా ఒక 'అడుగు' పొడవుండే పాదాలను ఎంత పొట్టిగా చేస్తే అంత బావుంటుందన్న ఆలోచనే ఇందుకు కారణం. ఈ 'పద్ధతి'లో నాలుగైదు సంవత్సరాలు వయస్సున్న బాలికల పాదాలను మడిచి గట్టిగా కట్టివేస్తారు. ఆ వయసులో అయితే పాదం ఎటుబడితే అటే వంగుతుందని, పెరగడం ఆగుతుందని ఆ విధంగా చేస్తారు. ఈ కార్యక్రమం కూడా చాలా పకడ్బందీగా సాగుతుంది. పది అడుగుల పొడవుండే రెండంగుళాల మందపు పట్టు వస్త్రాన్ని జంతు రక్తం, కొన్ని రకాల మూలికలతో నానబెట్టి, పాదానికి చుడతారు. ఇక ఇప్పుడు అసలు తతంగం ప్రారంభమౌతుంది. వేళ్లని 'సున్నితంగా' వెనక్కి మడచి తడి వస్త్రంలో చుడతారు. ఆ బట్ట ఆరుతున్న కొద్దీ కుంచించుకుపోతుంది, పాదాల చివళ్లను మడం వైపుకి లాగుతుంది.

ఈ తతంగం ప్రతి రెండవరోజూ తిరిగి జరుగుతుంది. తిప్పి కట్టిన ప్రతి సారీ మరింత గట్టిగా కట్టడం జరుగుతుంది. ఇలా ఏళ్లతరబడి జరుగుతుంది. ఆ అమ్మాయికి ఇష్టం ఉన్నా లేకపోయినా, చాలా కష్టంగా మాత్రం ఉంటుంది. నొప్పి, బాధ నిత్యమూ ఉంటుంది. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్లూ ఇతర సమస్యలూ తలెత్తుతాయి. అయినా 'ఆచారం' మార్చడం వీలు కాదు కదా. అలా పెరగక ఆగిపోయిన పాదం మూడు నుండి అయిదు అంగుళాలు ఉంటుంది. ఉష్ణపక్షి పాదంలా విచిత్రంగా (వారికి చాలా అందంగా) తయారౌతుంది.

అలా పెరిగిన పాదానికి బొటనవేలు తప్ప మరే వేలూ పైకి కనిపించేదికాదు. ఆ పాదం మూడు అంగుళాలుంటే అది అత్యుత్తమమైనది. దానిని గోల్డ్ లోటస్ అనేవాళ్లు. అదే నాలుగంగుళాలుంటే అది సిల్వర్ లోటస్ అయ్యేది. ఈ విచిత్ర





## ఇలా కూడా ...

❖ బాడీ పియర్సింగ్ (చెవి, ముక్కు, 'కుట్టి' నట్టే శరీరంలో ఎక్కడ పడితే అక్కడ రింగులనీ, ఇతర ఆభరణాలనీ' 'కుట్టించు'కోవడం.

❖ బ్రాండింగ్ (కావాలని శరీరాన్ని నియంత్రణగా కాల్చుకుని, శాశ్వత మచ్చ ఏర్పరుచుకోవడం. ఆబోతులకు 'అచ్చు' వేసినట్టు!)

❖ బ్రెస్ట్ ఇంప్లాంట్స్ (స్త్రీలు తమ వక్షాలను 'పెంచు'కోవడానికి సిలికాన్ జెల్ /సెలైన్ నింపిన సంచులను వక్షాల లోపల అమర్చుకోవడం)

❖ బ్రెస్ట్ ఐరనింగ్ (యుక్త వయసులో స్త్రీలు వేడి పరికరంతో తమ వక్షాలను 'ఇస్త్రీ' చేసి, అవి పెరగకుండా చూడటం)

❖ ఐబాల్ టాటూ (కంటిలో రంగు పదార్థం నింపి మచ్చ ఏర్పరుచుకోవడం)

❖ ఇయర్ షేపింగ్ (కొన్ని పశువులు, కుక్కలకు కత్తిరించినట్టు చెవిని రకరకాలుగా కత్తిరించుకోవడం)

❖ ఎక్స్‌ట్రా ఆక్యులర్ ఇంప్లాంట్ (కంటిలో ఆభరణాన్ని పొదగడం)

❖ టంగ్ స్లిట్టింగ్ - (నాలుకను పాము నాలుకలా చీల్చుకోవడం)

❖ టీత్ ఫైలింగ్ - వేలి గోళ్లను మలుచుకున్నట్టే పళ్లను కోసుకోవడం

❖ జెనిటల్ మాడిఫికేషన్స్- స్త్రీ పురుషులు మర్మావయాలను పలు విధాలుగా మార్చుకోవడం.

పాదాలతో నడవడమూ కష్టంగానే ఉన్నా వాళ్ళు ఇష్టంగానే నడిచేవాళ్ళు!

ఇంతకీ ఈ విచిత్రమైన ఆచారం ఎలా వచ్చింది? పదవశతాబ్దిలో ఒక చక్రవర్తి ఒక నాట్యకత్తె కాళ్లను తెగ మెచ్చుకున్నాడట. ఆవిడ పాదాలు చిన్నగా, బుడిపెలా ఉండి, బూట్లు వేసుకుంటే చాలా బావుండేదట. ఆ విషయం తెలిసిన నాట్యకత్తెలు చాలా మంది తమ పాదాలను మడిచి కట్టుకోవడం ప్రారంభించారు. క్రమేపీ ఆ అలవాటు ఫ్యాషన్‌గా మారింది. అప్పట్లో ధనికులు తమ కుమార్తెలకు ఈ పొట్టి పాదాల ఆచారాన్ని కొనసాగించేవారు. ఆ రోజుల్లో ఇది ఫ్యాషనే కాదు-సమాజంలో ఒక గుర్తింపు ఉన్నత కుటుంబం అన్న సూచిక కూడా. అయితే మిగతా స్త్రీలు- మధ్య, పేద తరగతుల వాళ్ళు- పొలం పనులు చేసుకోవాలి. కాబట్టి వాళ్లు ఈ ఆచారానికి 'అర్హులు' కారు. ధనిక, పేద వివక్ష ఉన్నా, ధనికులు కాని స్త్రీలకు ఈ ఆచార నియమం కలిసివచ్చింది!

పదిహేడవ శతాబ్దంలో వచ్చిన మాంఛూలు ఈ 'అనాగరికమైన' ఆచారాన్ని నిషేధించారు. అయినా రహస్యంగా ఇది కొనసాగుతూనే ఉండేది. అలా అలా ఇరవయ్యవ శతాబ్ది వరకూ ఈ పద్ధతి ఉన్నా, కింగ్ సామ్రాజ్యం కూలాక, రిపబ్లిక్ ఆఫ్ చైనా ప్రభుత్వం ఈ పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించింది. పాదాలకు కట్టిన కట్లు విప్పకపోతే మరణ శిక్ష విధిస్తామని బెదిరించింది. 1949లో కమ్యూనిస్టు ప్రభుత్వం వచ్చాక చిన్ని పాదాల పద్ధతి పూర్తిగా పోయింది.

ఈ గతించిపోయిన 'శారీరక మార్పు' (ఆచారం)లో ఫ్యాషన్ కన్నా ఇతర కీలక విషయాలు కొన్ని ఉన్నాయి. సమాజంలో ఉన్నత స్థాయితో పాటు, అటువంటి లోటస్ పాదాల స్త్రీ ఇంటి నుండి బయటకు వెళ్లడం కష్టమయ్యేది. తద్వారా తన భర్తకి విశ్వాసంగా ఉంటుందన్న ఆలోచన అప్పటి స్త్రీ వాదుల్ని కలవరపరిచింది. వాస్తవానికి అటువంటి మహిళా వాదులే ఈ ఆచారానికి అడ్డు తగిలి దానిని రూపు మాపడానికి కారణమయ్యారు.

### నాజూకు నడుము కోసం...

ఇదంతా 'ఆచారంగా' ఉంటే ప్రపంచంలో మరో పక్క అందం కోసం మరో విచిత్రమైన అలవాటు అమలులో ఉండేది. అదే 'కార్సెట్' ధారణ. 16వ శతాబ్దంలో పాశ్చాత్యదేశాలలో స్త్రీలు తమ నడుము సన్నగా చాలా సన్నగా కనిపించడానికీ, నడుము పైన, కింది' భాగాలు ఎక్కువగా కనిపించడానికీ ఈ తరహా వస్త్ర ధారణ చేసేవాళ్ళు. అయితే కొంత కాలం ఇటువంటి వస్త్రధారణను పైనుండి కింది వరకూ ఒకే విధమైన ఆకారం ఉండేందుకూ వాడేవాళ్ళు.

సన్నని నడుము కొరకు కొంత మంది పురుషులూ ఇలాంటి కార్సెట్లు ధరించేవాళ్లు. ఈ కార్సెట్‌లో ముందువైపు వస్త్రం, వెనుక లేసులు ఉండేవి. ఆ లేసులను బిగుతుగా గానీ, వదులుగా కానీ కట్టుకోవడం (షూ లేసుల్లాగా) వల్ల కావలసిన ఆకారాన్ని తెచ్చుకునేవాళ్ళు. ఇలా గట్టిగా కట్టుకోవడం కొన్నాళ్ళ పాటు కొనసాగితే నడుము సహజంగానే చాలా వరకు తగ్గిపోయేది. ఆ రోజుల్లో 16-17 అంగుళాల నడుము చాలా మందికి చిరకాల స్వప్నం. కానీ చాలా మంది ఆ స్థాయికి తగ్గకపోయినా 20-21 అంగుళాల వరకు సులభంగా తగ్గేవాళ్ళు. ఇథెల్ గ్రాంగర్ అనే ఆమె







## పొడవాటి మెడ కోసం...

థాయ్‌లాండ్, బర్మాలోని 'కరెన్నీ' మహిళలు జిరాఫీ మెడ స్త్రీలుగా పేరు పొందారు. చిన్నప్పటి నుండి మెడలో ఒక్కో లావుపాటి గొలుసు వేసుకుంటూ వుంటారు. దాంతో వీళ్ల మెడ పొడవుగా తయారౌతుంది. పైదేశాలలో ఈ పద్ధతి ఇంకా కొనసాగుతుంది. ఆఫ్రికాలోని కొన్ని జాతుల వారు కూడా ఇటువంటి తరహాలోనే తమ మెడల్ని సాగదీస్తారు. దాదాపు పద్దెనిమిది అంగుళాల వరకూ 'హంస' మెడలా తయారవుతుంది. మెడ చుట్టూ భారీ ఆభరణాలతో - అందంగా వుంటుంది! అయితే దీని మూలాలు మాత్రం అందానికి సంబంధించినవి కావు. పులి మెడకొరికి చంపితే జాతే అంతరించి పోతుందని భావించి ఆ తెగల్లో స్త్రీలకు (పొలాలలో పని చేసే వారిని) ఇలా లోహపు కచ్చడాలు మెడకి తగిలించేవారట!

తన నడుమును 13 అంగుళాలకు తగ్గించుకుని 1998 వరకూ గిన్నిస్ రికార్డుల్లో నమోదైంది.

ఈ కార్సెట్ ధారణవల్ల ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుందని అన్నా, చాలా మంది దీనిని వాడేవాళ్ళు. విక్టోరియన్ కాలంలో దాదాపు అందరు స్త్రీలూ తమ నడుములను బలవంతంగా బిగించుకోవడం ఆనవాయితీగా వుంది. అయితే ఆ స్త్రీలందరూ ఉన్నత కుటుంబాలకు చెందినవారే అవ్వడం విశేషం. వారికీ ఇతర స్థాయిల స్త్రీలకీ తేడా కోసం ఇలా తయారయ్యేవారు. ఇప్పటికీ సంఘంలో స్థాయిని బట్టి వస్త్రధారణ ఉన్నా, ఇంత కఠినంగా శరీరాన్ని 'కట్టి' పడేయడం లేదు.

ఇలాంటి గట్టి ధారణ వల్ల ఉదరం ఆకారం కోల్పోవడం, ఊపిరితిత్తులు సహజ పరిమాణాన్ని కోల్పోవడం, పక్కటెముకలు ఆకారాన్ని మార్చడం వంటి దుష్ఫలితాలు మెండుగా ఉండేవి. ఎదిగే పిల్లల్లో అయితే ఈ దుష్ప్రభావాలు మరింత ప్రస్ఫుటంగా ఉండేవి. అందుకే ఇప్పటికీ చిన్న పిల్లలు బిగుతుగా ఉండే దుస్తులూ, బూట్లూ వాడటం మంచిది కాదు.

### పెదవిపై రంధ్రం అందానికి చిహ్నం!

ఆఫ్రికాలో కొన్ని జాతుల మనుషులు రకరకాలుగా తమ శరీర అవయవాలను మార్పు చేసుకోవడం (బలవంతంగా) చూస్తుంటాం. అందులో ముఖ్యమైనది లిప్ ప్లేట్ కింది పెదవికి ఒక రంధ్రం చేసి, దానిని బలవంతంగా లాగి, అందులో పెద్ద చెక్క ముక్క గానీ, పెంకు ముక్క గానీ పెడతారు. కొన్ని జాతులలో పైపెదవికీ ఇటువంటి అమరిక చేస్తారు. తమ సముదాయంలో తమ స్థాయిని బట్టి ఆ చెక్క ముక్క పరిమాణం ఉంటుంది.

సాధారణంగా 13-14 ఏళ్ల వయసులో చిన్న గాటుతో ప్రారంభమయ్యే ఈ తంతు రెండు మూడు వారాలకు ఒకసారి మరింత పెద్ద చెక్క పెట్టడంతో సాగుతుంది. ముందుగా 3-4 సెంటీమీటర్ల ముక్కతో ప్రారంభమైనది క్రమంగా 10-15 సెంటీమీటర్ల (ఆరు అంగుళాల వరకు) సాగుతుంది.

కొన్ని సందర్భాలలో 25 సెంటీమీటర్ల చెక్క కూడా పెట్టుకున్న వాళ్లూ ఉన్నారు. ఆ తరువాత ఆ చెక్కని తీసేస్తారు. దాంతో విచిత్రంగా పెదవి వేళ్లాడుతూ ఉంటుంది.

### తల ఆకారం కూడా ....

దక్షిణ అమెరికా (పెరూ), ఆఫ్రికాలోని కొన్ని జాతులు తమ తల ఆకారాన్ని బలవంతంగా మార్చుకునేవాళ్ళు. శరీరాకృతిని (అవయవాలు) మార్చుకోవడం బహుశా ఇదే మొదలు కాబోలు. ఇప్పటికీ ఆయా ప్రాంతాలలో అడపాదడపా ఈ అలవాటు కనిపిస్తుంది. కపాలాన్ని ఆకారం మార్చడం ప్రమాదకరమైనది. అయినా ఆజాతులు తమ ఉపజాతి ప్రత్యేకత కోసం చిన్నప్పటి నుండి క్రమంగా, బలవంతంగా కపాలపు ఆకారాన్ని మార్చేవాళ్లు.

### కాళ్లు ఆకర్షణీయంగా కనిపించాలని...

దక్షిణ అమెరికాలోని గయానాలో వావాయ్ తెగ ప్రజలు మరో వింత ఆచారాన్ని పాటించేవారు. యువతుల మోకాలి పైన గట్టిగా, బిగుతుగా తాళ్లతో కట్టుకునేవాళ్ళు. తద్వారా మోకాలి కింది భాగం లావుగా ఉబ్బి, అందంగా, ఆకర్షణీయంగా కనిపించేది. దక్షిణ సూడాన్ ప్రాంతంలోని డింకా ప్రజలు కూడా ఇటువంటి పద్ధతిని పాటించి తమ చేతులు, కాళ్ళు 'ఆకర్షణీయంగా' మార్చుకునేవారు.

ఇటువంటివి మరికొన్ని ఎప్పుడో పాతకాలంలోనూ, ఆటవిక తెగలలోనూ ఉండటం



వాస్తవమే. అయినా ఈనాడూ చాలా మంది చాలా రకాలుగా తమ అవయవాలను మార్చు కుంటున్నారు. అందుకోసం వాటిలో కొన్ని బాగానే ఉన్నాయి. చాలా వరకూ మాత్రం శరీరంపై అవాంఛనీయ ప్రభావాలను చూపుతాయన్నది మర్చిపోతున్నారు.

విపరీతపోకడలు చాలానే ఉన్నాయి. కావాలని లింగ మార్పిడి చేసుకోవడం, సిలికాల్ సంచులను వక్షాలలో కుట్టేసుకోవడం, చెవి, ముక్కులతో పాటు కళ్లు, నాలుక, బొడ్డు, చర్మం మర్మావయవాలకు సైతం 'రింగు'లు తగిలించుకోవడం, ఆకర్షణీయంగా ఉండటం కోసం పెదవిపై లేని పుట్టుమచ్చలను పెట్టు మచ్చలుగా పెట్టించుకుని ముచ్చట తీర్చుకునే రోజులు పోయి శాశ్వతంగా శరీరం మొత్తం పచ్చబొట్టు పొడిపించుకోవడం వంటివి సాధారణమైపోయాయి.

### వెర్రి వెయ్యి విధాలు

శరీరాన్ని దృఢంగా, మంచి ఆకారంలోకి మలచుకోవడానికి శారీరక వ్యాయామం తప్ప మరొకటి తెలియదు చాలా మందికి. కానీ, కాసులుంటే కసరత్తులు అవసరం లేదని తెలుసుకున్న తెలివి గల వాళ్ళు కావలసిన రీతిలో కండలు పెంచి కొవ్వు తగ్గించుకుంటున్నారు. ప్లాస్టిక్ సర్జరీ సాయంతో దాదాపు సర్వం సాధ్యమౌతోంది.

ఉన్న మచ్చల్ని పోగొట్టుకోవడం, లేని రంగు తెచ్చుకోవడం వంటివి ప్రమాదరహితంగా, అవసరంగా అనిపిస్తున్నాయి. అలాగే కాస్త ధైర్యవంతులు ఇంకాస్త ముందుకెళ్లి మరీ విచిత్రంగా అనిపించే బాడీ మాడిఫికేషన్లు చేయించుకుంటున్నారు. ఒకప్పుడు సామాజికంగా కూడా ప్రభావం చూపించిన మాడిఫికేషన్లు ఇప్పుడు సర్వసాధారణమైపోయాయి. కేవలం కొన్ని ఆటవిక తెగల జీవనంలో భాగమైన శారీరక మార్పులు ఇప్పుడు అధునాతన నాగరికులకు సామాన్యమయ్యాయి. 'నా శరీరం నా ఇష్టం' అనుకునే వాళ్లు ఏమైనా చేసుకుంటుంటే... 'వాళ్ల శరీరం వాళ్ల ఇష్టం' అనుకోవడం మినహా మిగతావాళ్ళు చేయగలిగింది మాత్రం ఏముంటుంది చెప్పండి. ఏదేమైనా వెర్రి వెయ్యి విధాలు. ❋

**డాక్టర్ సిఎల్ వెంకటరావు,**
సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హైదరాబాద్.

# ఆహార నాళంలో ఆరోగ్య సమస్యలు

**అనారోగ్యం వచ్చినప్పుడు ఎవరూ స్వయంగా ప్రథమ చికిత్స చేసుకోలేరు. అందుకని ప్రతివారూ ప్రథమ చికిత్స గురించి, మొదటి దశలోనే అనారోగ్యాన్ని గుర్తించడం గురించి కొంత అవగాహన కలిగి ఉండటం అవసరం. అనారోగ్యానికి గురై బాధపడే కన్నా ముందుగానే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మంచిది. ఆహారనాళానికి సంబంధించి వచ్చే ఆరోగ్యపరమైన సమస్యల గురించి ఈ వారం మీకోసం ప్రత్యేకంగా...**

మనం తీసుకునే ఆహారాన్ని దంతాలు చిన్న చిన్న ముక్కలుగా నములుతాయి. పొడిగా ఉన్న ఆహారం జీర్ణం కావడం కష్టం. నాలుక కింద సబ్ లింగ్వువల్ గ్లాండ్స్, పరోటెడ్ గ్లాండ్స్, సబ్ మాండిబ్యులార్ గ్లాండ్స్ లాలాజల రసాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి నమిలిన ఆహార పదార్థాలను ద్రావకంగా తయారుచేస్తాయి. ద్రవరూపంలో ఉన్న ఈ ఆహారం నోటిలో నుంచి గొంతు ద్వారా ఆహారనాళం (ఈసోఫాగస్) లోకి ప్రవేశించి అక్కడ నుండి జీర్ణాశయం (కడుపు)లోకి ప్రవేశిస్తుంది. లోపలి వైపున లాలాజలం (సలైవా) గ్రంథులుంటాయి. జీర్ణాశయం గోడలలో కొన్ని ఆమ్లాలు, జీర్ణరసాలు ఉత్పత్తి అవుతాయి. అవి ఈసోఫాగస్ ద్వారా లోపలికి ప్రవేశించిన ఆహారాన్ని జీర్ణం చేస్తాయి.

జీర్ణాశయం పూర్తిగా నిండిపోయేలా మనం ఆహారాన్ని తీసుకోకూడదు. సగ భాగం వరకే తినాలి. మిగిలిన సగభాగంలో సగం నీరు, సగం ఖాళీ ఉండాలి. దీని వలన జీర్ణరసాలతో కూడిన ఆహారం జీర్ణక్రియ జరిగే సమయంలో అటు, ఇటు కదిలించి మర్దన చేసి ఆహారాన్ని మరింతగా జీర్ణం చేయడానికి వీలవుతుంది.

కొంతమంది సమయానికి ఆహారం తీసుకోరు. అలా చేస్తే జీర్ణరసాలు జీర్ణాశయ గోడల మీద తమ ప్రభావాన్ని చూపుతాయి. ఆహార నాళం మొత్తం మెత్తటి మ్యూకస్ పొరలతో లోపలి భాగమంతా కప్పబడి వుంటుంది. ఇలా కప్పిన ఈ పొర కండరాలు, కణాలేవీ ఆహార నాళంలో సంచరించే ఆహారంతో సరాసరి తగలకుండా రక్షిస్తుంది. ఆమ్లాలు, జీర్ణరసాలు కడుపులో ఉన్న ఈ పొరమీద ప్రభావం చూపించడంతో ఆ పొర దెబ్బ తింటుంది. లోపల ఉండే కండరాలు, రక్తనాళాలు వాపుకు గురవుతాయి. ఆహార నాళంలో ఇలా పుళ్ళులా ఏర్పడటాన్ని అల్సర్స్ అని అంటారు. అల్సర్లు కేవలం కారం తినడం వల్లే రావు. అల్సర్లు ఉన్నవాళ్ళు కారం తింటే నొప్పితో గిలగిలలాడుతారు. కడుపులో అల్సర్ల వల్ల రక్తస్రావమైతే నోటి నుండి రక్తపు వాంతులు కావచ్చు. కాబట్టి నోటి ద్వారా రక్తంపడితే లోపల ఏదో ప్రమాదం జరుగుతున్నట్లు అనుమానం కలిగితే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. దీనికి ఎండోస్కోపి పరీక్ష చేసి చికిత్స చేయొచ్చు.

ఆహారనాళానికి జఠరాశయానికి మధ్య ఒక కవాటం ఉంటుంది. ఇది లోపలి ఆహారాన్ని బయటకు రానీయదు. కాబట్టి మనం శీర్షాసనం వేసినా కడుపులోని ఆహారం గొంతుద్వారా బయటకు రాదు. ఈ కవాటం దెబ్బతిన్నప్పుడు జఠరాశయంలోని రసాలు ఆహారనాళం వద్దకు వచ్చి ఉదర ప్రాంతంలో మధ్యగా మంటపుడుతుంది. ఇలాంటి సమయాల్లో వెంటనే వైద్యుణ్ణి సంప్రదించడం అవసరం. ఇలా గొంతులోకి రసాలు వచ్చినప్పుడు గొంతులో పుల్లగా, చేదుగా ఉండటం, పులిత్రేన్పులు వంటివి వస్తాయి. కవాటాన్ని సరిచేసి ఈ అనారోగ్యాన్ని నివారించొచ్చు.

కాలేయ జబ్బులున్నా జీర్ణాశయం, ఆహారనాళం గోడల్లోని రక్తనాళాలు ఉబ్బి, రక్తస్రావం కావొచ్చు. పరీక్ష చేయించుకుని కాలేయానికి చికిత్స పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవడం మంచిదికాదు. కొద్ది కొద్దిగా ఆహారాన్ని ఎక్కువ సార్లు తీసుకోవచ్చు. ఆకుకూరలు, పీచు పదార్థాలు కూడిన ఆహారం తీసుకోవాలి. జీర్ణమవుతున్న ఆహారం చిన్న పేగుల మొదటి భాగం డుయోడినంలోకి చేరుతుంది. ఆ పక్కనే ఉండే కాలేయం నుంచి బైల్‌రసం, పాంక్రియాస్ నుంచి జీర్ణరసం నాళాల ద్వారా డుయోడినమ్‌లోకి వచ్చి ఆహారంతో కలిసి జీర్ణక్రియను సంపూర్ణం చేస్తాయి.

జీర్ణక్రియలో ఇన్ని రసాలు డుయోడినమ్‌లోకి ప్రవేశిస్తాయి. కాబట్టి... ఒక్కోసారి వీటి ప్రభావం వలన డుయోడినల్ అల్సర్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ జీర్ణమైన ఆహారం చిన్న పేగుల రెండవ భాగం జెబునమ్‌లోకి, తర్వాత ఇలియమ్‌లోకి ప్రవేశిస్తుంది. ఈ రెండు భాగాలలో జీర్ణమైన ఆహారం రక్తంలోకి చేరి అక్కడి నుంచి కాలేయంలోకి చేరుతుంది. కాలేయం ఆహార పదార్థాలలోని విష పదార్థాలను వేరు చేసి... రక్తంలోనుంచి బైటికి పంపుతుంది. అక్కడ చేరిన వ్యర్థ పదార్థాలను బయటికి తెస్తుంది. శరీరానికి కావాల్సిన ఎంజైములు ఏమైనా బయటకు వెళుతుంటే లివర్ వాటిని వేరు చేసి వెనకకు పంపుతుంది. పనికిరాని వ్యర్థ పదార్థాలన్నీ పేగులోకి చేరతాయి. ఈ ఘన వ్యర్థాలు బైటికి వెళ్ళేటప్పుడు ద్రవాలను పేగుల గోడలు పీల్చేస్తాయి. ఈ వ్యర్థాలు మలం రూపంలో బయటికి వెళ్ళిపోతాయి.

ఆహారంలోని ఫైబర్ శరీరానికి కావాల్సిన వ్యర్థాలను బయటికి పంపివేయడానికి సహకరిస్తుంది. డైవర్టిక్యులార్ డిసీజ్, ప్రేగుల కేన్సర్ రాకుండా ఫైబర్ తోడ్పడుతుంది. ఆహారంలో విష పదార్థాలు ఆహార నాళంలోకి ప్రవేశించినప్పుడు లోపల భాగం ఇరిటేట్ కావచ్చు. వాంతులు, విరేచనాలు వంటివి అవుతాయి. ఈ ఇబ్బందుల వల్ల అజీర్ణం, గాస్ట్రయిటిస్, ఎసిడిటీ, గాల్‌స్టోన్స్ వంటివి ఏర్పడవచ్చు. ఈ ఇబ్బందులు ఆహార నాళంలో సమస్యల్ని సృష్టించవచ్చు. గొంతు నుంచి మల ద్వారం వరకూ కండరాలు పెరియాలిస్టిక్ మూవ్‌మెంట్‌తో లోపలికి వచ్చిన ఆహారాన్ని కిందికి నెడుతూ, జీర్ణక్రియ, వ్యర్థాలు బయటకు వెళ్ళడం వంటి చర్యలకు సహకరిస్తాయి.

కథ

# తప్పు ఎవరిది?

డా॥ నాగినేని భాస్కర రావు

**తాగుడు వ్యసనంతో ఇతర సాంగత్యాలకు పోయావు. పోయి పోయి హెచ్ఐవిని తెచ్చుకున్నావ్. అదే నన్ను అదరగొట్టింది. జీవితంలో చెదరగొట్టింది. ఎయిడ్స్ దశకు చేరిన నీకు సేవలు చేసి నీ మల, మూత్రాలు తీసి, బట్టలుతికి నీ మురికి నంతా శుభ్రం చేసి వేళకు మందులిచ్చి, ఆహారం ఇచ్చి ఎటిఆర్ మందుల్ని క్రమం తప్పకుండా మింగించాక నీవు తేరుకున్నావ్! ఇంత చేసినా నన్ను - నిర్దాక్షిణ్యంగా వదిలేయటానికి నీ మనసెలా ఒప్పింది? నా మనసు, నా తనువూ నీకే అర్పించా. నా వొంట్లో ఓపికున్నంత వరకు నీకు అన్ని సేవలు చేశా. ఈ లోకంలో నా వాళ్ళు ఎవరూ లేరు ఆ సంగతి తెలిసి, నా సేవలతో బలిసిన నీవు నన్ను విస్మరించావు - తృణీకరించావు.**

**నా** కోసం వెంటపడి, వేధించి, బ్రతిమాలి - బామాలి- నన్ను- పెళ్ళాడి నా అణు వణువునూ తాకి మైమరచిన నీ మనసు ఎక్కడకు పోయింది? కొత్తలో-రోజులు క్షణాల్లో ఐపోతున్నా యేనని యవ్వన సామ్రాజ్యం మనదేనని మరల మరల గుర్తు చేసుకున్న నీ మనసు ఎక్కడకు పోయింది? పిల్లవాడు పుట్టాక కూడా 'ఇంకా నీ అందం ఇనుమడించిందని', 'ప్రకృతి కాంత నీ ముందు బలాదూరు' అని 'పిల్లాడి తల్లివి బాగా తినాలని' అని నాకు కొసరి కొసరి తినిపించిన నీ మనసు ఎక్కడకు పోయింది?

అత్తమామలు, మరిది, మరదలు ఉన్న చోట మన సంసారం సరిగ్గా నడవదని నాకు చెప్పి 'కోడలు వేరుకాపురం పెట్టాలంటోందని నా మీద అబద్ధమాడి వేరుకాపురం పెట్టి రోజంతా ఇంట్లో తిష్టవేసి 'సంసార సౌఖ్యం'తో వెళ్లబుచ్చిన నీ మనసు ఎక్కడకు పోయింది? సినిమాకు తీసుకెళ్ళి...సినిమా చూడనీయక నా ఒళ్లంతా హూనం చేసి పక్క వాళ్ల బుర్రలు వేడెక్కించి - వాళ్లు గోల చేస్తే- సినిమా మధ్యలోనే లేపుకు వచ్చి-దగ్గర లాడ్జిలో నన్నుకూడి -తమకం తీర్చుకున్న నీ మనసు ఎక్కడకు పోయింది?

మనం మంచి ఇంట్లో వుండాలని చెప్పి దాని కోసమని నా చెవికమ్మలతో సహా తెగ నమ్మి నీవు వ్యసనాలపాలైనా ఇంటిని అమర్చలేక పోయినా-నిన్ను అంటిపెట్టుకుని 'పెళ్ళినాటి ప్రమాణాలకు' కట్టుబడి-పెద్దల మాటలకు విలువిచ్చి- సేవ చేసి- అలసిసొలసిన నన్ను- మనసులో ఏమున్నా పైపై బుజ్జగింపులు చేసిన నీ మనసు ఎటు పోయింది?

వివాహమైన కొత్తలో కొద్ది రోజులు బాగానే వున్నావు. మొదట బాబు పుట్టినపుడు సంతోషంతో గెంతులు వేశావ్! సగర్వంగా అందరికీ చెప్పుకున్నావ్. అయితే- ఇక సంతానం వద్దన్నావ్. ఏకంగా నీవే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నావ్- నాకు మాట మాత్రం చెప్పలేదు. అప్పుడే మన మధ్య విభేదాల బీజాలు పడ్డాయి. సహనమే శరణ్యమని, నేను నీతో రాజీపడ్డాను. అది నా జీవితం మొత్తానికి గండి కొడుతుందనుకోలేదు. 'మన భారతీయ సంస్కృతి వారసురాలను' అని అనుకున్న 'సతీ సావిత్రి'లా - నిన్ను, నీ వ్యసనాలను భరించా. అటువంటి నన్ను నిర్లక్ష్యం చేసేందుకు నీ మనస్సు ఎలా ఒప్పుకుంది?

ఒకరోజు-హైదరాబాద్‌లో ఎన్‌టిఆర్ గార్డెన్‌కు వెళ్ళి జంట నగరాల వారధి హుస్సేన్ సాగర్‌కు కూడా వెళ్ళాం. బాటలో తిరిగాం. బుద్ధుడికి నమస్కరించాం. ఒక ఉద్వేగానికి లోనయ్యాం. తిరిగి ఇంటికి వచ్చాక మనం కూడా కోరికల్ని ఎందుకు చంపుకో కూడదన్నావ్. జీవితాన్ని క్రమశిక్షణలో వుంచుకుంటానన్నావ్. కాని నీ మాటల్ని మర్చిపోయి నీ వ్యసనాల్ని పెంచుకొని, ఆస్పత్రిపాలైతే- అన్ని పరీక్షలు చేసిన డాక్టర్ నీకు 'ఎయిడ్స్' అన్నాక నీ మాటలు నీటి మూటలని తెలినా - నీ వల్ల నాకు హెచ్ఐవి ఎయిడ్స్ సోకిందని తెలిసి నేను పడ్డ బాధ మాటల్లో, అక్షరాల్లో చెప్పలేక చివరిదాకా- కష్టంలో, సుఖంలో కలిసి వుండాలన్న బాధ్యతకు లోబడి - నీతోనే వున్నా- నీ నీడలా వున్నా. అటువంటి నన్ను గాలికొదిలేయటానికి నీ మనసెలా ఒప్పింది?

ఉన్న ఒక్కగానొక్క కొడుకునూ మర్చిపోయావు. తాగుడు వ్యసనంతో ఇతర సాంగత్యాలకు పోయావు. పోయి పోయి హెచ్ఐవిని తెచ్చుకున్నావ్. అదే నన్ను అదరగొట్టింది. జీవితంలో చెదరగొట్టింది. ఎయిడ్స్ దశకు చేరిన నీకు సేవలు చేసి నీ మల, మూత్రాలు తీసి, బట్టలుతికి నీ మురికి నంతా శుభ్రం చేసి వేళకు మందులిచ్చి, ఆహారం ఇచ్చి ఎటిఆర్ మందుల్ని క్రమం తప్పకుండా మింగించాక నీవు తేరుకున్నావ్! ఇంత చేసినా నన్ను - నిర్దాక్షిణ్యంగా వదిలేయటానికి నీ మనసెలా ఒప్పింది? నా మనసు, నా తనువూ నీకే అర్పించా. నా వొంట్లో ఓపికున్నంత వరకు నీకు అన్ని సేవలు చేశా. ఈ లోకంలో నా వాళ్ళు ఎవరూ లేరు. ఆ సంగతి తెలిసి, నా సేవలతో బలిసిన నీవు నన్ను విస్మరించావు-తృణీకరించావు. చావు ఎవర్నీ వదలదు- ప్రకృతి దోషులందర్నీ శిక్షిస్తుంది. నీకు సేవలు చేసి ఎయిడ్స్ చివరి దశకు వచ్చిన నన్ను ఆస్పత్రికి తేచ్చేవారు కరువై ఎవరో పాజిటివ్ పీపుల్స్ నెట్‌వర్కు వాళ్లు ఓ కమ్యూనిటీ సెంటర్లో వదేశారు.

నేనిప్పుడు చావుకు దగ్గరౌతున్నా- చనిపోయిన....నా శవాన్ని సైతం చూసి అంత్య క్రియలు నిర్వహించని నీ నీచ, నికృష్ట చర్యలకు నా శవం సైతం లేచి కూర్చుని భీకరమౌ తుందేమో? నన్ను పెనవేసుకొని పెనుగులాడి, పెనుగులాడి సుఖించిన - నీ మనసు ఎక్కడకు పోయింది? నేనిప్పుడు చిక్కి, అస్థిపంజరాన్నై అమరపురికి పోతున్నా! నీ పిరికి, స్వార్థ మనస్తత్వం తగలబడిపోనీ! నీ అమానుష చర్యలు ఇక సమసి పోనీ! నా ఉసురుకు నీ ఊపిరి ఆగిపోనీ!!

❖ ❖ ❖

అవును! నేను అమాయకుణ్ణి - మోసపోయాను. నీ అవయవపొంకాలకు మురిసిపోయి నిన్ను కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాను. తొలి రోజుల్లో, యవ్వన ప్రాభవంలో నీవడిగినదల్లా కొనిచ్చాను- తృప్తి నిచ్చాను. నీవు చెప్పినదల్లా ఆచరించా- ఆనందం కల్గించా! ఆదాయాన్ని మించి ఖర్చు చేసి- ఆ తప్పుతో అప్పుల్లో మునిగి నలుగురిలో నవ్వులపాలయ్యా! వివాహం గురించి, ఆ తరువాతి జీవితం గురించి కన్నాను కలలెన్నో - ఎన్నో సంవత్సరాలు. మన వివాహమయ్యాక అవి తీరుతాయనుకున్నా కనే కలలు నిజమౌతాయని నిరూపిద్దామనుకున్నా! నీతో జీవితం మొదలైన నాటి నుండి లభించిన ఆనందం కొద్దిగా మాత్రమే! పెళ్ళి కాగానే - అత్తమామల్ని వద్దన్నావ్! వాళ్ళ నుండి విడిపోయి వేరు కాపురం పెట్టాం! అక్కడా రోజూ నీతో చీటికి మాటికి తగాదాలు. నీ స్థితిని మరచి ప్రవర్తించావు.

బాధ్యతగల భర్తగా అన్నీ సహించా! నగలు చేయించలేదని కొంత కాలం పిల్లలు కలుగలేదని- పొలం కొనలేదని కొంత కాలం - ఇల్లు కట్టలేదని కొంత అసలు నేను నచ్చలేదని, ఇష్టం లేదని కొంత కాలం ఇలా వేధించి, వేధించి విసిగించినా- నేను నిన్ను ప్రేమగానే చూశా! నిన్నూ, పిల్లల్నీ పోషించా. కాని- ప్రపంచీకరణ నేపథ్యంలో - నవనాగరికత ముసుగులో చదువులేక పోయినా సూపర్ మార్కెట్టులో నీవు 'సహాయకురాలి'గా చేరతానంటే కాదనలేకపోయా! నీ భావాల్ని పసికట్టలేకపోయా. నీవు డ్యూటీకి వెళ్లేటప్పుడు నీ అలంకరణను ఆక్షేపించలేకపోయా. నీకు అక్షరజ్ఞానం లేదని ఓపిగ్గా అక్షరాలు నేర్పి - పుస్తకాలు చదివేలా చేశా. అలాగైనా నీలో ఆలోచన పెరుగుతుందని నీలో విచక్షణ పెరుగుతుందని, విజ్ఞానం పెరుగుతుందని సంస్కారం పెరిగి మన సంసారం సారవంతమౌతుందని ఆశించా! నా ఆశలు అడియాసలయ్యాయి!!

మధ్యలో నేను, పిల్లలు బలైపోయాం. నేను నీతి మంతుడనైనా- శ్రీరామచంద్రుడనైనా నీ వల్ల, నీ దుష్ప్రవర్తన వల్ల కల్లా కపటం తెలియని పిల్లలు అల్లరిపాలయ్యారు. తెల్లబోయిన ముఖాలతో తెప్పరిల్లలేకపోతున్నారు. డొల్ల తనంతో నేను నిన్ను కూడి నీ వెక్కడో అంటించుకున్న జబ్బుకు దాసోహపద్దాను. దారుణంగా నా శరీరం హెచ్ఐవి పాలైంది. నీకు ఎడ తెగని దగ్గు, జ్వరం, వాంతులు, విరేచనాలు - నెల్లాళ్ల పాటు!

నిన్ను దగ్గర్లోని కమ్యూనిటీ కేర్ సెంటర్లో చేర్పించి అన్ని రోగాలకు మందులిచ్చి, నేనే సేవలు చేశా. నీవక్కడికి మందులకు ఆహారానికి తేరుకున్నావు. ఓ సంవత్సరం తరువాత నువ్వు మామూలు స్థాయికి వచ్చావు. నిన్ను ఇప్పుడు చూస్తే ఎవరూ ఎయిడ్స్ రోగి అనుకోరు! ఆ స్థితి రావటానికి ఎంత కాలం పట్టింది? ఆ స్థితి రావటానికి కారణం నేను, నా సేవలే కదా! నీ మనసుకు తెలుసు- చుట్టూ ప్రపంచానికి తెల్సు. కాని... నా స్థితి తారుమారైంది. రోజూ రాత్రి పూట జ్వరం, చెమటలు, దగ్గు. నేను బాధపడుతుంటే నన్నసలు పట్టించుకోలేదు. పిల్లల్ని నేనే దగ్గరకు రావద్దన్నాను. వాళ్లను నా తల్లిదండ్రుల వద్దకు పంపాను. దానితో నీవసలు ఇంటి పట్టున లేవు. వచ్చినప్పుడు - నేను మాట్లాడినప్పుడు కస్సుబుస్సులాడావు. 'భార్యగా నా పట్ల నీకు బాధ్యత లేదా? పెళ్ళయిన ఈ ఇరవై ఏళ్లూ నేను కుటుంబాన్ని నడపలేదా? 'కనీసం నన్ను ఓ కమ్యూనిటీ కేర్ సెంటర్‌లో చేర్పించు" అన్నాను. "సరే రేపే వెళ్దాం. ఆ తరువాత నీ సంగతి నాకు పట్టదు" అన్నావు. అక్కడ చేర్పించి వదిలేశావ్. వాళ్ళు 'నీ భార్య ఏదయ్యా? ఒకరు తోడు వుండాలి' అని అడిగితే నా కన్నీళ్ళే వాళ్లకు సమాధానం అయ్యింది. నీవు తిరిగి రాలేదు. ఎయిడ్సు చివరి దశలో అధిక రక్తపోటుతో, స్పృహతప్పిన నన్ను- నలభై రోజుల పాటు - మందులివ్వక, తిండి పెట్టక మాడ్చి మాడ్చి మరణానికి పంపావు! మానవత్వాన్ని మరచావు. నాకు జరిగిన అన్యాయం రేపు నీకు జరుగుతుంది. వివాహ వ్యవస్థకు నీవొక మాయని మచ్చవు! నా జ్ఞాపకాలు - నిన్ను ఒట్టిగా వదిలిపెట్టవు!!

❖ ❖ ❖

ఏమిటి మా తప్పు? మీ ప్రవర్తన ఎలా అవుతుంది ఒప్పు? మా పరిస్థితి ఎలా బాగవుతుందో చెప్పు - అమ్మా నాన్నా? పిల్లలందరూ హాయిగా ఆడుతుంటే- పిల్లలందరూ హాయిగా అమ్మ ఒడిలో, బడిలో వుంటే-పిల్లలందరూ చక్కగా నాన్న సంరక్షణలో వుంటే-పిల్లలందరూ త్వరగా ఎదుగుతుంటే-పిల్లలందరూ మంచి దుస్తుల్లో తిరుగుతువుంటే-పిల్లలందరూ ఆరోగ్యంగా అలరారుతుంటే మేమేమో - దగ్గుతోనో, జ్వరంతోనో, విరేచనాలతోనో, చర్మ వ్యాధులతో, క్షయ వ్యాధితోనో పెరుగుదల లేక జీవితపు అరుగుదలతో అనాథల్లా మగ్గుతున్నాం! అన్నం పెట్టే వాళ్ళ ఆజ్ఞలకు మొగ్గుతున్నాం. మీరేమో లేరు కదా.

మా వల్ల తాతయ్యల్ని, అమ్మమ్మల్ని, నాయనమ్మల్ని సైతం వీధి నుండి - కొన్ని చోట్ల వూరి నుండి గెంటేస్తున్నారు! మేమేమో- హెచ్ఐవి/ఎయిడ్స్ పిల్లల అనాథ శరణాలయాలకు చేరుకున్నాం చివరికి. అక్కడ నిర్వాహకుల దయ - మా ప్రాప్తం. ఈ రాకూడని మా దైన్యం మీ వల్లే కదా! అక్కడ ఆయాలు చెప్పినట్లు నడుచుకోవాలి. లేకపోతే - తిండి సరిగ్గా పెట్టరు. మందులు సరిగ్గా ఇవ్వరు. ఎదురుతిరిగితే ఒంటి మీద కానరాని దెబ్బలు కొడతారు. వాళ్ళూ ఎయిడ్స్ వచ్చిన వాళ్లే నట. వాళ్ల పిల్లల్ని ఎక్కడో వదిలారట. మమ్మల్నేమో సరిగా చూడరు- ఇదంతా మీ వల్లే కదా! వాళ్ల పిల్లలు ఎప్పుడైనా వస్తే ఆ ఆయాలు వాళ్లని నెత్తిన పెట్టుకుని ఆఫీసర్ల లాగా చూస్తారు. గతించిన మిమ్మల్ని గుర్తుకు తెస్తారు.

అమ్మా! నాన్నా! మీరు మీరు పోట్లా డుకుని అసంబద్ధంగా ప్రవర్తించారు. మమ్మల్ని మీరు కనకుండా వుండాల్సింది! అసలు కన కూడదు కదా. కన్నా ఈ జబ్బు మాకు రాకుండా మందులు వాడాల్సింది. మేమిప్పుడు- మీరు చేసిన తప్పులకు శిక్షల రూపంలో ప్రపంచానికి కన్పిస్తున్నాం, భారమయ్యాం! ప్రతి వాడూ- సానుభూతి కురిపించి మా ద్వారా డబ్బు సంపాదిం చాలనే. ఆ దొంగ సానుభూతిని మేం తట్టుకోలేకపోతున్నాం. మీరుంటే-మీరు కొట్టినా, తిట్టినా మీతో జీవితం మాకానందం! కానీ- 'లేరన్న' నిజం మమ్మల్ని తొలుస్తున్నది. హెచ్.ఐ.వి./ ఎయిడ్సు వచ్చిన పిల్లల సంరక్షణ కేంద్రాలు పెట్టి మాలాంటి కొందర్ని అందులో చేర్చి- మమ్మల్ని శాంపిల్‌గా చూపించి నిర్వాహకులు డబ్బు దండుకోవటం మాకు తెలుస్తూనే వుంది. ఏ తాతో, ఏ అమ్మమ్మో- ఏ నాయనమ్మో ఏ బాబాయో లేక ఏ దయామయుడో వస్తే తప్ప మాకు బయటి ప్రపంచం తెలియదు.

ఎప్పటి దాకా బ్రతుకుతామో తెలియదు. బ్రతుకుతూ చావు రోజుల్ని లెక్క పెట్టిలేని స్థితి మాది! మా తల్లిదండ్రులుగా - మీరు సక్రమంగా జీవిస్తే - ఆరోగ్యంగా వుంటే వివాహ వ్యవస్థని, సామాజిక న్యాయాన్ని గౌరవిస్తే మన సంస్కృతి, ఆచారాలను, ధర్మాలను పాటిస్తే - మాకీ గతి పట్టేది కాదు- మీరు చిన్న వయసుకే యమపురికి చేరారు. ఎంత బాగా చూసినా - ఆయా తల్లి కాలేదు.

ఎంత బాగా చూసినా నిర్వాహకుడు తండ్రి కాలేదు. మా తలలకు వెలలు నిర్ణయించి- దానాలకు చేయి చాపే వాళ్ళు శ్రేయోభిలాషులు కాలేరు. ఇదో భిక్షాటనా కార్యక్రమం - పేరు సంఘ సేవ. దాన్ని వదిలేద్దాం! మా సంగతి కొద్దాం! మా సమస్యలు వినండి!!! ఈ సంరక్షణా కేంద్రాల్లో మా యిష్టాలతో నిమిత్తం లేదు. వాళ్ళు నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం భోజనం, నిద్ర చదువు, ఇంకా ఇతర కార్యక్రమాలు. సందర్శకులకు మా అందరి వినమ్ర ప్రణామాలు, ఆటలు పాటలు... అంతా కృత్రిమం- కృత్రిమ- కుటిలం! అయినా- మీ ప్రవర్తన వల్ల మాకు బలవంతపు జీవితం. స్వర్గంలోనో, నరకంలోనో మీరుంటారట. అక్కడి నుండి చూస్తారా? అక్కడికి మమ్మల్నే రమ్మంటారా? రోజుకు ఐదారు రకాల మందులు- చర్మంపై తరచూ పొక్కులు. మధ్యలో జ్వరం, దగ్గు, రక్త పరీక్షలు - ఎఆర్ టి మందులు ఇంత చిన్న వయస్సులో మీరెప్పుడైనా ఇన్ని మందులు తిన్నారా?

మామూలు మనుషుల్లాగా మా రక్తాన్ని ఎవరూ కళ్ళజూడరు. దెబ్బ తగిలి, చర్మం చిట్లితే - మమ్మల్ని చూసే డాక్టర్లు తక్కువ. దయగల, ధైర్యం గల డాక్టరు వచ్చేదాకా మా గతి అంతే. ఆడపిల్లలైతే ముట్టు వస్తే ఎంతో బాధ. యుక్త వయస్సుకు ఎంత మందిమి వస్తామో తెలియదు. వస్తే గిస్తే- మాకు కొన్ని తిప్పలు తప్పవు. మా కళ్ళ ముందు చిన్న పిల్లలు ఎయిడ్సు ముదిరి మరణిస్తారు. "రేపు మేమూ ఇంతే కదా!" అని కన్నీరు కారుస్తాం. లేని మీ కోసం రాని బంధువుల కోసం పరితపిస్తాం! జాతిగల వాళ్ల కోసం, ఒక మంచి పలకరింపు కోసం ఎదురు చూస్తాం! మా జీవితంలో బాల్యమూ, కౌమారమూ కష్టాలమయం. 'వివాహ దశకు పోనే పోమ' నుకుంటాం. నేరుగా చితిమంటల్లోకే! మిగిలిన కుటుంబ సభ్యుల్లారా! మా కోసం రండి ఎప్పుడన్నా! మాకోసం ఆలోచించండి -క్షణమైనా. లేని అమ్మా! నాన్నా! మా కోసం దిగిరండి భువికి! మా కోసం ప్రేమ మేఘాలపై రండి. మా కోసం, మాకోసం మీ అప్యాయతల వర్షం కురిపించండి! ఓ ఎయిడ్సు వచ్చిన తండ్రీ! నీ భార్యకు నీ జబ్బు అంటించకు. ఓ ఎయిడ్సు వచ్చిన తల్లీ! నీ వ్యాధిని నీ బిడ్డకు బదలాయించకు! ఎయిడ్సు లేని పిల్లల్ని కనండి! పెంచండి....!!!

❋

డా॥ జె.పి. వైద్య

'హంగల్'
అంటే లేడి అని అర్థం... వాళ్ళ పూర్వజులు కాశ్మీర్ పండితులు. లక్నో నుండి పెషావర్‌కు తరలి వెళ్ళిన వాళ్ళు. ఆయన చదువుకున్నది 'పెషావర్'లో. వాయవ్య దిశలో 'ఆఫ్ఘనిస్థాన్ కొండలూ...' తూర్పున పంజాబీ సస్యశ్యామలమైన పొలాలూ.. రాత్రి బ్రిటీష్ మిలట్రీ దాదాగిరీ... కాని, ఆ రోజుల్లో హిందువులు, ముస్లిములూ అన్యోన్యంగా కలిసి ఉండేవారు. రౌతిగేట్‌లో రెండంతస్తుల మహల్... వూళ్ళో ఎంతో పేరున్న 'హంగల్'కు సంగీతం అంటే ఎంతో మక్కువగా ఉండేది. వేణువు ఎంత దర్జాగా వాయించేవాడో, అంతే హుందాగా పెయింటింగ్స్‌లోని రంగులతో తాదాత్మ్యం చెందేవాడు.



# సూటు బూటు హుందాతనం కోరుకున్న హంగల్!

శరదృతువులో కన్పించే శూన్య మేఘాలను అమృత బిందువులు వర్షించమని అడగవు. అలాగే, పలకరించి శాంతంగా వెళ్ళిపోతాయి కాబోలు. ఎటువంటి బాధలు వచ్చినా, ఆర్థికమైనవీ, సామాజికమైనవీ, అవాంత రాలు ఇబ్బంది పెట్టినా, ప్రాణాలు తీసే భయాలు వేధించినా, ఏమాత్రం చలించకుండా తనపై దండెత్తి వచ్చిన దుఃఖాలను నివారించుకునే ఉపాయం తనే ధైర్యంగా అన్వేషించుకునే ధైర్య సాహసాలున్న వ్యక్తిని కష్టాలు కూడా అలా పలకరించి 'మంచిది సారూ! తర్వాత ఎప్పుడైనా వస్తాములెండి' అని తల వంచుకొని వెళ్ళిపోతాయి.

ఆ మనిషి మటుకు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ జనసందోహంలో నిలబడి పోతాడు.

హిందీ చలన చిత్ర రంగంలో ఎన్ని రంగులలో... అన్ని హంగులూ...!
ఎన్ని చిత్రాలో... అన్ని విచిత్రాలు...!
ఎన్ని తమాషాలో... అన్నీ ఇంకా 'హమేషా'గా నవ్వు తెప్పిస్తూ ఉంటాయి.
నాతో తమాషాగా ముంబాయికి రండి. వూరికే నిల్చోక కొన్ని దశాబ్దాలు వెనక్కి ప్రయాణం చేయండి.
కొంచెం వయస్సు మళ్ళాక సినీ రంగంలో కాలుమోపి, స్థిరంగా నిల్చున్న ఒక మనిషి 'రంగుల్నీ... హంగుల్నీ' గమనించండి.

ముంబాయి 'లి' చిత్ర నగరిలో ఓ స్టూడియోలో షూటింగ్ సాగుతోంది. 'లైట్స్ ఆఫ్... ప్యాకప్...!' అని డైరెక్టర్ గారు కీచుగా అరిచారు. అంతా గోలగోలగా 'ప్యాకింగ్' చేసి పారేస్తున్నారు. హీరో అలసిన కళ్ళు మూయకుండా వడివడిగా తన కారుకేసి వెళ్తున్నాడు. హీరోయిన్ ఆటో...! మరో 'మోస్ట్ రెస్పెక్టబుల్ గ్రాండ్ ఓల్డ్ మాన్' కూడా డిటోగానే సాగిపోతున్నాడు ఆయన కారువైపు.

'ఫ్యాన్స్' గిర్రుమంటూ రింగులు తిరుగుతూ దొరికిన 'కళాకారుడి'ని పట్టుకొని, క్లోజప్‌లో చూస్తూ చేతికందిన కాయితం ముక్కమీద 'ఆటోగ్రాఫ్' లు తీసుకునే ప్రక్రియలో తలమునకలై పోతున్నారు.

ఫుల్ సూట్‌లో, తలపై మెల్లగా చేతిని తిప్పుతూ 'తండ్రి' వేషం వేసిన పెద్దాయన హుందాగా నడిచి వెళ్తుంటే గుంపులోని ఒక గోవిందరావుగారు 'ఆటోగ్రాఫ్ ప్లీజ్...!' అని డైరీ ముందుంచాడు.

ఫుల్ సూట్ కళ్ళల్లో ఓ వింత వెలుగు...! మనస్సులోనే నవ్వుకున్నాడు.

– 'అరే! ఇదేమిటీ...? ఇంతమంది అందాలు వెదజల్లే అప్సరసల్లాంటి హీరోయిన్స్, రాజకుమారుల్లాంటి 'హీరో సార్లుండగా నన్ను పట్టుకున్నారేమయ్యా!" అని మనస్సులోనే ప్రశ్న వేసుకున్నారు సదరు ఫుల్ సూట్‌గారు.

ఆయనకు మడత నలగని సూట్లూ, చక్కగా ప్రెజెంట్ చేసిన భోజనం ప్లేట్లూ చాలా ఇష్టం. తిండిపోతు కాదు కాని, 'గుడ్ ఫుడ్ లవర్' ... అన్నీ నీటుగా ఉండాలి. బట్టల విషయంలోనూ అంతే! నిక్కచ్చి మనిషి. ఇస్త్రీ నలగొద్దు... కాలర్ పడుకోవద్దు. కడక్ ఇస్త్రీ మీద నిమ్మకాయనైనా కోసే సూట్లు తొడుగుతాడని కాదు కానీ, 'గుడ్‌డ్రెస్ సెన్స్' ఉన్న పెద్దాయన.

– 'ఆటోగ్రాఫ్ ప్లీజ్...!' మళ్ళీ వేడుకోలు.

పెన్ను స్టైల్‌గా పట్టుకొని – 'ఓకే! ఓకే! యంగ్ మ్యాన్...! ఆటోగ్రాఫ్ సరే! కాని, నా సినిమాలెన్ని చూశావూ? నా గురించి నీకేం తెలుసూ?' అని అడిగాడు కుతూహలంగా.

– అదేం సార్! అలా అడుగుతారు. మీరు నా అభిమాన నటులు కదా! 'గైడ్'లో మీ నటన ఎలా మరిచిపోతాము...?

జవాబు విన్న సదరు 'ఫుల్ సూట్ పెద్ద మనిషి' ఖంగుతిన్నట్టు చూశాడు. సంతకం పెట్టబోతూ, అరక్షణం ఆగిపోయాడు.

– 'గైడా? ఓహ్! నా పూర్తి పేరు చెప్పుకో చూద్దాం!' అన్నాడు అనుమానంగా. అవతలి, మనలాంటి 'వీరాభిమాని' ఒక 'వీరనవ్వు' నవ్వి ఉత్సాహంగా పలికాడు.

– 'కిషోర్ సాహూ!'

సూటాయన ఉలిక్కిపడి, క్షణంలో తేరుకొని 'ఏ.కే. హంగల్' అని సంతకం చేశాడు.

ఆ తర్వాత నవ్వుతూ అందరికీ ఆ విషయం చెప్పి నవ్వించాడు.

హృషికేశ్ ముఖర్జీ 'గుడ్డి'గా జయబాధురీ సినీ రంగ ప్రవేశం చేసింది. ఆమె తండ్రిగా నటించాడాయన. సంజీవ్‌కుమార్, తనూజాలు నటించిన అత్యద్భుతమైన శ్వేతశ్యామ హిందీ చిత్రం 'అనుభవ్'లో ఆయన 'ఆల్ ఇన్ వన్'. ఇంటి 'నౌకరు'గా జీవించాడు. 'షోలే'లో తన పాత్ర కత్తెరకు బలైపోయింది. అని మనస్సులోనే 'ఫీల్' అయ్యాడాయన. ఒకప్పుడు గుల్జార్ ఒక స్వాప్నిక కవి. అత్యద్భుత ప్రతిభాపాటవాలున్న దర్శకుడు. ఆయన సినిమాలన్నీ ఇంగ్లీషు సినిమాల కాపీ అని జనాలు మెల్లగా గొణుగుతూ ఉంటారు. ఆయన పట్టించుకోలేదు. తేనెకళ్ళ అందాలనటి 'రాఖీ' భర్త. 'బోస్కీ' తండ్రి. హిందీ చలన చిత్ర రంగంలో ఆయన కలం 'జాదూ' చేసింది. 'పరిచయ్'లో జితేంద్ర మామయ్యగా వేశాడాయన. కాస్తంత చెవుడు ఉన్నట్టు, చెవులవెనక చెయ్యి పెట్టి 'ఆఁ' అని అడిగే పాత్రను మనలో ఎవరు మరచిపోయారనీ? హుందాగా, పసందుగా, దుఃఖంగా, ఆత్మీయంగా ఏ పాత్రలోనైనా సజీవంగా జీవించిన 'ఏ.కే.హంగల్' పుట్టింది 'పాకిస్తాన్'లో.

ఆయన జీవితయాత్ర 'సియాల్‌కోట్' 'పెషావర్' – 'కరాచీ' మీదుగా ముంబాయి వచ్చి స్థిర పడింది.

'హంగల్' అంటే లేడి అని అర్థం... వాళ్ళ పూర్వజులు కాశ్మీర్ పండితులు. లక్నో నుండి పెషావర్‌కు తరలి వెళ్ళిన వాళ్ళు. ఆయన చదువుకున్నది 'పెషావర్‌లో'. వాయవ్య దిశలో 'ఆఫ్ఘనిస్థాన్ కొండలూ...' తూర్పున పంజాబీ సస్యశ్యామలమైన పొలాలూ.. రాత్రి బ్రిటీష్ మిలట్రీ దాదాగిరీ... కాని, ఆ రోజుల్లో హిందువులు, ముస్లిములూ అన్యోన్యంగా కలిసి ఉండేవారు. రౌతిగేట్‌లో రెండంతస్తుల మహల్... వూళ్ళో ఎంతో పేరున్న 'హంగల్'కు సంగీతం అంటే ఎంతో మక్కువగా ఉండేది. వేణువు ఎంత దర్జాగా వాయించేవాడో, అంతే హుందాగా పెయింటింగ్స్‌లోని రంగులతో తాదాత్మ్యం చెందేవాడు. ప్రజలనాకర్షించడానికి అర్ధరాత్రి నిబీడాంధకారపు ప్రశాంతతలో 'హార్మోనియం' వాయించేవాడు. జనాలు తిక్కతో లేచి 'ఎవరూ? ఎవరాయన' అని అడగాలని. ప్రతి గురువారం సంగీతం మెహఫిల్, బైఠక్‌లు సాగేవి. బడే గులామ్ అలీఖాన్, ఛోటే గులామ్ అలీఖాన్, బేగం అఖ్తర్ గురువైన ఆషిక్ అలీ ఖాన్ లాంటి హేమా హేమీలతో సంగీతం పంచుకున్న దిట్ట.



రాజకీయాలకు సంగీత సాహిత్యాలతో ఏం సంబంధం? రాజకీయాలు రగిలాయి.

అవునన్నా, కాదన్నా జనాల జీవితాలను రాజకీయాలు అతలాకుతలం చేశాయి. కరాచీ రేడియోలో నాటకాలేసిన 'హంగల్' దోస్తీ వామపక్ష భావాలున్న రాజకీయ నేతలతో సాగింది. పెనవేసుకుంది. ముంబాయిలోని 'ఇప్టా'లో ఉన్నవాళ్ళు చిన్నవాళ్ళు కారు. హేమాహేమీలు. కే.ఏ. అబ్బాస్, బల్‌రాజ్‌సాహ్నీ, దీనా పాఠక్, మన తెలుగు వాడైన డా॥ రాజారావుతో దోస్తీ సాగింది. ఫలితంగా జైలు గాలి పీల్చాల్సి వచ్చింది.

అక్కడ ఐదు బీడీలకు ఒక బ్లేడ్, పదిహేను బీడీలకు ఒక సబ్బు, మూడు బీడీలకు ఒక చడ్డీ... ఇలా దొరికేవి. బీడీలిచ్చి బ్లేడ్ సంపాదించి నున్నగా, నీట్‌గా 'షేవింగ్' చేసుకునేవాడు 'హంగల్'.

ఆఖరు మజిలీగా 'ముంబాయి'లోని సాండర్స్ రోడ్‌లో ఒక చిన్న గల్లీలో ఒక చిన్న గదికి చేరుకున్నాడు.

అదో శిబిరం లాంటిది. పోలీసుల గొడవ వద్దని అగ్రిపేడా ప్రాంతంలో, తర్వాత 8×7 అడుగుల పరేల్ ప్రాంతం 'నిర్మలా నివాస్'కు చేరుకున్నాడు.

నీళ్ళు సరిగ్గా దొరికేవి కావు. అందరూ సరదాగా 'నిర్జల నివాస్' అని పిలుచుకునే వారు. ముంబాయిలో బ్రతుకు తెరువు కోసం 'టేలరింగ్ ఫర్మ్'లో 'కట్టర్'గా చేసినా – మిగతా కాలక్షేపం నాటకాలూ, వామపక్ష భావాలున్న నేస్తాలతో వాదోపవాదాలే!

అలా అబార్స్ అత్రే, ఎస్. యమ్. జోషి, డాంగే, గోరే, ధాకరే (శివసేన ధాకరే గారి తండ్రి), అహల్యా రంగనేకర్‌లతో స్నేహం. 'బొంబే టేలరింగ్ వర్కర్స్ అసోసియేషన్‌తో సత్ సంబంధాలు... అధికార వర్గంతో గొడవలు. శైలేంద్ర, సలీల్ చౌదరీ, కానూఘోష్, హబీబ్ తన్వీర్, అలా 'ఇప్టా' నాటకాల నుంచి సినిమాల్లో ప్రవేశించాడు హంగల్.

జీవితం ఎంతో సాదాసీదాగా గడిపినా కొన్ని విషయాల్లో పట్టింపులుండేవి. టైంకు మంచి భోజనం. ఎప్పుడూ మంచి డ్రెస్‌లు, ఇంటిలో ఎలాంటి నౌకర్లు ఉండేవారు కారు. సొమ్ములూ, నగలూ అసలే వర్జం. విలువైన, ఖరీదైన షోకులూ లేవు.

పనామా సిగరెట్టు కాల్చేవాడు. షూటింగ్‌లో తోటి కళాకారులు అడుగుతారని దూరంగా వెళ్ళి 'ఫుస్... ఫుస్' అని ఊది వచ్చేవాడు.

ఓరోజు దూరంగా సంజీవ్ కుమార్ 'ఫుస్' మని 555 బ్రాండ్ ఊదేస్తున్నాడు. హంగల్‌ను చూసి కలవరపడిపోతూ... అదే...! మరి 555 బ్రాండ్ కదా! అక్కడుంటే ఎవరైనా అడుగుతారేమో అనీ' అంటూ నసిగాడు.

దొందూ దొందే!

'ఫుస్' మని తన హీరోయిన్‌ను జ్ఞాపకం చేసుకుంటూ పొగతాగి, మందుతాగి, తిని, తినీ, 'సంజీవ్ కుమార్' తిరిగి రాని లోకాలకెళ్ళి పోయిన రోజు హంగల్ షూటింగ్‌లో ఎంతో దూర ప్రదేశంలో ఉన్నాడు.

సంజీవ్ మరణవార్త విని తన గదిలోకి వెళ్ళి చిన్న పిల్లవాడిలా బావురుమని ఏడ్చాడు హంగల్.

నేడు ఏకాంతంగా ముంబాయి మహానగరంలోని చిన్న గదిలో హాయిగా జ్ఞాపకాల మధ్య కాలం కరిగేలా తన 'ఖాస్ ఢంగులూ... హంగులతో' కాలం గడుపుతున్న 'హంగల్' ను మనం మరిచిపోతామా ఏమీ? మనకు ఆయన సంగీతం, వామపక్ష భావ సాహిత్యం, పెయింటింగ్స్ లాంటివి తెలియకపోవచ్చుకాని 'షోకేన్' లోని ఉత్పల్ దత్త, అశోక్‌కుమార్‌తో 'స్టైలిష్'గా 'యూత్‌ఫుల్'గా ఎగిరి గంతులేసిన 'ఏ.కే. హంగల్' ను ఎవరు మరిచిపోతారు.

మన స్టైల్ మనది, మనమూ స్టైల్‌గానే తలచుకుంటాం!!

*

**దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.**

**ఫోన్ : 08732223622**



వీరి వీరి గుమ్మడి పండు

**జవాబు**

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరు సంజయ్‌దత్

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

## చదవలేకపోతున్నా

నేను చదివేటప్పుడు అనవసర ఆలోచనలు వస్తున్నాయి. చదువు మీద ఏకాగ్రత ఉంచలేక పోతున్నాను. ప్రతి రోజు 6,7 గంటలు కూడా చదవలేక పోతున్నాను. దీని వల్ల టెన్షన్‌కు లోనై చాలా సమయం వృధా అవుతోంది. చదువు మీద ఆసక్తి కోల్పోతున్నాను. దయచేసి నా సమస్యకు తక్షణ పరిష్కారం సూచించగలరు. నా మనసు నా అదుపులో ఉండేందుకు చేయవలసిన మైండ్ ఎక్సర్‌సైజ్‌లను, చదవవలసిన పుస్తకాలను చెప్పగలరు.

నిఖిల్, నిజామాబాద్.

సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుందేమోననే భయంతో ముందుగానే మీకు గల ఉద్వేగానుబంధాన్ని వదులుకుంటున్నారు. అనేకసార్లు అపజయాలను చవి చూసిన వ్యక్తి కూడా ప్రయత్నానికి దూరంగా వుంటాడు. నేను 'చదివినా' నెగిటివ్ రిజల్ట్స్ వస్తాయనే భయం నీలో వుంది. దానితో సరిగా చదవకుండా వుంటేనే బెటర్ అనే నిర్ణయం వలనే చదవలేకపోతున్నారు. మీరు చేయవలసిందేమిటో స్పష్టంగా తెలుసుకోండి. మీ అభిప్రాయాలు, నమ్మకాలు, వైఖరులు, వ్యక్తిగత హక్కులను గుర్తించి తదనుగుణంగా మెరుగైన ప్రవర్తనను అలవర్చుకోండి. మీరు 45 నిమిషాలు చదివి 10 నిమిషాలు విరామం ఇచ్చి మరలా 45 నిమిషాలు చదవండి. అలా విరామం ఇచ్చి ఎంత సేపు చదివినా చక్కగా గుర్తుంచుకుంటారు. మీరు గతంలో బాగా చదివిన, బాగా పరీక్షలు రాసిన సందర్భాలను గుర్తుకు తెచ్చుకోండి... "చదువు- విజయం" పుస్తకం చదవండి. సెల్ఫ్ హిప్నోసిస్, రిలాక్సేషన్ టెక్నిక్స్, యోగా శ్వాసక్రియ ఎక్సర్‌సైజ్‌లు చేయండి.

## గాఢంగా ప్రేమించా...

నాకు16 సంవత్సరాలు. నేను ఒక అబ్బాయిని ప్రేమిస్తున్నాను. అతనుకూడా నన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడు. మా తల్లిదండ్రులు ఒప్పుకునే ప్రసక్తే లేదు. ఒకవేళ ఒప్పుకోకున్నా మేము పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. మేము ఇద్దరం ఒకరిని విడిచి ఒకరం ఉండలేము. మాది గాఢమైన ప్రేమ. మమ్మల్ని ఈ ప్రపంచంలో విడకొట్టేది చావు మాత్రమే. ఒక విధంగా చెప్పాలంటే వరసకు అతను చిన్న బాబాయి అవుతాడు. సొంతం కాదు. దయచేసి మా జీవితంలో ఏ విధంగా సెటిల్ కావాలో తెలియజేయండి.

వర్ష, మెదక్.

ప్రేమ చాలా గొప్పది. ఈ వయసులో తెలిసీ తెలియని ఆకర్షణే ప్రేమ అనుకోవడం మానవ సహజం. మీ కుటుంబ సభ్యుల్ని ప్రేమించడం, అభిమానించటం గొప్ప విషయం. లేని పోని ఆలోచనలతో మనసు పాడు చేసుకుంటున్నావు. ప్రేమకు చావు పరిష్కారం కాదు. నీకు ఆ అబ్బాయి వరుసకు బాబాయి అవుతాడంటున్నావు. పెళ్ళి చేసుకోవడం వల్ల పుట్టిన పిల్లల

వరుసలు ఎలా మారిపోతాయో ఆలోచించు. ఈ వయసులో తాము అనుకున్నవే కరెక్ట్ అనే భావనతో జీవితాన్ని శాసించి, పక్కదారి పట్టించే నిర్ణయం వల్ల తెలిసీ తెలియని అమాయకత్వంతో జీవితాన్ని బలి తీసుకుంటున్నారు. దీనికితోడు మతం, విద్యా వ్యవస్థ సైతం యువతరంపై పట్టు కోల్పోతున్నాయి. విలువలను అసలు పట్టించుకోవటం లేదు. మీ టీనేజ్ వయస్సులో కుటుంబం పట్ల వాటి ప్రతిష్ఠల పట్ల స్పృహ వుండడంలేదు. దీనివల్ల పిల్లలు, కుటుంబ వ్యవస్థ మధ్య తీవ్రమైన అంతరం ఏర్పడి ఒక అఘాతంలా తయారవుతుంది. నీవు పెళ్ళి చేసుకోవడానికి ఇంకా చాలా సమయం ఉంది. ఆ అబ్బాయి పి.జి. చేసి జాబ్ సంపాదించాలి. ముందు నీ చదువు మీద దృష్టి పెట్టు. ఆ అబ్బాయి సెటిల్ అయితే మీ పెద్దవాళ్ళు ఒప్పుకోవచ్చు. అప్పటి వరకు ఓపికతో వేచి ఉండు. ఆల్ ది బెస్ట్.

## మతిమరుపు పోవాలంటే...

నాది ఒక విచిత్ర సమస్య. నేను చిన్నప్పటి నుండి డల్‌గా వుండేవాడిని. అయితేనేం బాగానే చదివేవాడిని. 10వ తరగతిలో 480 మార్కులు వచ్చాయి. కాని ఇంటర్ రెండు సంవత్సరాలూ ఫెయిల్ అయ్యాను. ఈ రెండుసంవత్సరాలు ఏమయ్యిందో కాని ఎవ్వరికి మొహం చూపలేకపోతున్నాను. మాది బీద కుటుంబం. బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలనుకున్నాను. చాలా కామ్‌గా వుంటాను. ఎవరితో మాట్లాడను. నాకు జ్ఞాపకశక్తి పూర్తిగా తగ్గిపోయింది. మతి మరుపు పెరిగింది. దేనిమీద ఆసక్తి లేకుండా పోతోంది. నా సమస్యకు పరిష్కారం తెలుపగలరు.

శ్రీను, నందిగామ.

మీరు న్యూరోటిక్ డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. మీ వీక్‌నెస్ మీ మరణానికి దారి తీస్తుంది. మీ శక్తే మీకు జీవితాన్నిస్తుంది. మీ శక్తిని గుర్తించండి. మేధస్సుకి పేదరికం అడ్డురాదు. పేదరికాన్ని జయించడం కోసం ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోండి. మీ లక్ష్యం మీద దృష్టి పెట్టి చదవండి. ఆ లక్ష్యం గురించి ఆలోచిస్తూ దాని భావనలతో జీవించడమే మీ దృక్పథం కావాలి. మీ ఆసక్తి మీ ఏకాగ్రతకు దోహదం చేస్తుంది. అపజయం అనేది ప్రతి వ్యక్తికి వుంటుంది. మంచి మార్కులు సాధించిన విద్యార్థుల్లో ఏ సామర్థ్యాలైతే ఉన్నాయో అవి ఫెయిల్ అయిన విద్యార్థుల్లో కూడా వుంటాయి. మీ విజ్ఞానం పెరగాలంటే నేర్చుకునే సామర్థ్యం పెంపొందించుకోండి... మీలో ఉన్న సామర్థ్యం మెరుగుదిద్ది ఉపయోగించుకుంటే విజయాన్ని సాధించగలరు. సమాజంలో ఏర్పడే మార్పులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మార్చుకోండి... మిమ్మల్ని మీరు జయిస్తే ఈ పోటీ ప్రపంచంలో మీరు దేనినైనా జయించగలరు.

# పాన్ బజ్జి

**కావలసిన పదార్థాలు**

తమలపాకులు- 50, పచ్చిమిర్చి-100 గ్రాములు

సెనగపిండి- అరకిలో, లవంగాలు, అల్లం, జీలకర్ర, ఉప్పు, నూనె.

**తయారు చేసే విధానం**

అంత లేతవీ అంత ముదురువీకాని తమలపాకులు శుభ్రంగా కడిగి తడి ఆరబెట్టాలి. సెనగపిండి జల్లిస్తే మెత్తగా వుండి ఆకులకు బాగా అంటుకుంటుంది. పచ్చిమిరపకాయలు, అల్లం, జీలకర్ర, లవంగాలు మెత్తగా నూరి సెనగపిండిలో కలపాలి. తర్వాత ఉప్పు వేయాలి. ఈ పిండి పలచగా వుండాలి. తమలపాకు తొడిమ పట్టుకుని ఈ పలచటి పిండిలో ముంచితే పిండి అంటుకుంటుంది (పిండి గట్టిగా కలిపే కొద్దీ దళసరిగా అంటుకుంటుంది). వాటిని కాగే నూనెలో వేసి తీస్తే తమలపాకు ఆకారంలోని బజ్జీలు చూడటానికి... తినడానికి బాగుంటాయి.

# గులాబ్ జామ్ (పాల పొడితో)

**కావలసిన పదార్థాలు**

పాలు - అర లీటరు, పాలపొడి - 10 గ్రాములు

పంచదార- పావు కిలో, నెయ్యి- 200 గ్రాములు

మైదా- 1 టీస్పూను, రోజ్ ఎసెన్స్- 1 చుక్క

నెయ్యి - కొంచెం

**తయారు చేసే విధానం**

పాలల్లో పాలపొడి కలిపి మరగకాయాలి. పాలు ముద్దగా అయ్యే వరకు మరగబెట్టాలి. ఇది అలా వుంచి. ఈ ముద్దకి సరిగా రెట్టింపు పంచదార ఒక పాత్రలో వేసి పాకం తియ్యాలి. తీగపాకం రాగానే దించి అందులో ఎసెన్స్ కలిపి వేరుగా వుంచుకోవాలి. మైదాలో... పేరిన నెయ్యి వేసి బాగా కలపాలి. ఈ మైదాముద్ద, పాల కోవా ముద్దలో చేర్చి రెండూ బాగా కలపాలి. మూకుడులో నెయ్యిపోసి బాగా కాగనివ్వాలి. పైన చెప్పిన ముద్దని వుండలు వుండలుగా చేసి నేతిలో వేయించాలి. ఎరుపు రంగు రానిచ్చి పాకంలో వెయ్యాలి. పాకం చల్లారేటప్పటికి వుండలు పాకాన్ని బాగా పీలుస్తాయి. తినడానికి రుచిగా ఉంటాయి.

# రుచి

# తంగ్‌డీ కబాబ్

**కావలసిన పదార్థాలు**

8 చికెన్ లెగ్స్- (కింది భాగాలు), అల్లం- అంగుళం ముక్క

ఎండు మిరపకాయలు- 4-5, జీలకర్ర- 1 టీ స్పూన్

వెల్లులి రేకులు- నాలుగైదు, గరం మసాలా - 1 టీ స్పూను

**తయారు చేసే విధానం**

మసాలా దినుసులన్నింటిని కలిపి మెత్తగా ముద్దగా నూరి పెట్టుకోండి. చికెన్ లెగ్‌ను బాగా కడిగి శుభ్రం చేసి, తడి అద్ది పొడిగా వుండేలా చూడాలి. నూరుకున్న ముద్దను వాటిపైకి పట్టించాలి. పూర్తిగా అంటుకునేలా పూయండి. ఒక పాత్రలో మూత పెట్టి నాలుగైదు గంటలు బాగా ఊరనివ్వండి. బొగ్గు కుంపటిపై సన్నటి సెగలో చక్కగా అన్నివైపులా ఎర్రగా కాల్చి, ఉల్లి చక్రాలు, నిమ్మకాయ ముక్కలు, గ్రీన్‌చట్నీతో వడ్డించండి.

# అటుకుల దోసె

**కావలసిన పదార్థాలు**

అటుకులు- 1 కేజీ, మజ్జిగ- రెండు కప్పులు, బియ్యం- 1 కిలో, ఉప్పు- కొంచెం, ఇంగువ- కొంచెం, పచ్చిమిర్చి- 10 గ్రాములు, జీలకర్ర- 1 స్పూన్, సోడా- చిటికెడు, నూనె- పావు కిలో

**తయారు చేసే విధానం**

అటుకులు శుభ్రంగా కడిగి మట్టి పాత్రలో నానబొయ్యాలి. పుల్లని మజ్జిగలో నానవేస్తే మంచిది. అటుకులు తొందరగానే నానతాయి. అలాగే బియ్యం కూడా నీళ్ళలో నానబోసి వుంచుకోవాలి. బియ్యం బాగా నానిన తర్వాత అటుకులు కలిపి రెండూ మెత్తగా రుబ్బాలి. దోసెల పిండిలా మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బిన తర్వాత ఉప్పు, పచ్చిమిర్చి, ఇంగువ, జీలకర్రవేసి బాగా కలపాలి. కొంచెం సోడా కూడా చేర్చవచ్చు. సోడా వేస్తే బాగా పొంగుతాయి. పెనం మీద నూనె రాసి కొంచెం దళసరిగా పిండిపోస్తే దోసెలు తినడానికి బాగుంటాయి.

కథా నిలయం






# రుధిర జ్యోతికి కవితాహారతి

తెలుగు కవిత్వ విమర్శకులను నిరంతరాయంగా ఆకర్షిస్తున్న ఆలోచింపచేస్తున్న కవులలో శ్రీరంగం నారాయణబాబు ఒకరు. జీవిత కాలంలో ఆయన కవితా సంకలనం ఒక్కటీ అచ్చుకాకపోయినా తన కాలపు కవిత్వంపైన, కవులపైన ఆయన ప్రభావం అనల్పం. అలాంటి ప్రతిభావంతుడి జీవిత సాహిత్యాలను సమగ్రంగా నివేదించే ప్రయత్నం "శ్రీరంగం నారాయణబాబు కవితా వైశిష్ట్యం". రచయిత డా. యు. ఎ. నరసింహమూర్తి.

నారాయణబాబు మహా కవి శ్రీశ్రీకి చాలా కాలం అతి సన్నిహితులుగా మెలిగారు కాని తర్వాత కాలంలో ఎందుకో దూరమైనారు. 'నీ పాటల కత్తులతోనే/ నా హృదయపు నెత్తురు తీసి/ నే వెలిగించిన ఈ దీపపు కాంతిని/ నర్తింపుమురా శ్రీశ్రీ అంటూ రుధిర జ్యోతిని వెలిగించాడు నారాయణ బాబు. 'దారి తప్పిననారి బాబూ/ ఫైజు ఫైటరు పాపరాజు / పలకరించేంత అని శ్రీశ్రీ చమత్కార కవిత్వం రాశాడు. "అభ్యుదయ సాహిత్యాకాశంలో సూర్య చంద్రులుగా ప్రకాశించిన శ్రీశ్రీ నారాయణబాబులిద్దరూ మనకు ప్రియతములైన కవులే' నని ఈ పుస్తక రచయిత నరసింహమూర్తి అంటారు. అలాంటి సమన్వయ దృష్టితోనే ఆయన నారాయణబాబు కవితా పరామర్శ చేశారు.

వీరేగాక ఆ దశలో విజయనగరంలో చాసోతో సహా ఎందరో ప్రగతిశీలులు, ప్రతిభా వంతులు కలసి మెలసి అధ్యయనం చర్చలు సాగించేవారు. నారాయణ బాబు మహోపన్యాసకుడుగానూ, సకల కవి మిత్రుడుగానూ అందరికీ ప్రియతముడైనాడు. సోషలిస్టు భావాల వైపు ఆకర్షితుడైన ఆయన తొలినాళ్లలోనే స్వాతంత్ర్యం, సామ్యవాదం మేళవించిన విప్లవ భావాలతో కవితలల్లారు. భగత్‌సింగ్‌పై ఆయన రాసిన కపాలమోక్షం కవిత అన్నిటికన్నా ప్రసిద్ధమైంది.

భాషా ప్రయోగంలోనూ, సంప్రదాయాన్ని నూతన అర్థంతో కవితా సృజన చేయడంలో నారాయణబాబును ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రతీకలు వాడటంలో ప్రత్యేకత సంతరించుకున్న నారాయణబాబును తెలుగులో ఇమేజిస్టు కవిత్వానికి అగ్ర గణ్యుడుగా పరిగణిస్తారు. కొన్ని సందర్భాల్లో ఆయన కవితా చరణాల్లో శ్రీశ్రీ గుర్తుకు వస్తాడు. వాస్తవానికి ప్రయోగశీలతలో శ్రీశ్రీ కన్నా ఆయనే మెరుగని వాదించేవారూ వున్నారు. నారాయణబాబు 1961లో మరణిస్తే 1972లో ఆయన కవితలను 'రుధిరజ్యోతి' పేరిట తొలి సంపుటంగా ఆరుద్ర సవివరమైన పీఠికతో తీసుకొచ్చారు. ఆ 'ముందుమాట' లోనూ ఈవిధమైన వాదన కనిపిస్తుంది. ఆయనకు మరో మిత్రుడైన సోమసుందర్ కూడా రుధిరజ్యోతిర్దర్శనం పేరుతో సమీక్షా గ్రంథం తీసుకొచ్చారు. ఏమైనా నారాయణబాబు కవిత్వంపై సహేతుక చర్చ కన్నా సంవాదాలే ఎక్కువగా జరిగాయి.

భాషా సాహిత్యాలలో అపారమైన పట్టుగల నరసింహమూర్తి ప్రస్తుత గ్రంథం ఆ కొరతను చాలావరకు తీరుస్తుంది. ఇందులోని వివిధ అధ్యాయాలు లోగడ వ్యాసాలుగా పత్రికలలో వచ్చినవే అయినా వాటిని అప్పటికే ఒక అవగాహనతో క్రమపద్ధతిలోనే రూపొందించుకుంటూ వచ్చారు. ఒకో అధ్యాయంలో ఒకో అంశాన్ని పరిశీలించారు. స్థూలమైన పరిచయ అధ్యాయం తర్వాత 'వెన్నెల లోతుల్లో నారాయణబాబు' అంటూ చంద మామను వెన్నెలను గురించి ఆయన కొత్త రీతుల్లో రాసిన వైనం చెప్పారు. 'ఇమేజిస్టు కవి నారాయణ బాబు'లో ఆయన వాడిన ప్రతీకల ప్రత్యేకతలు తెలిపారు. 'ఇనప గీతాలు' అనే భాగంలో ఆయన ప్రయోగాల కఠోర వాస్తవికతను కళ్లకు కట్టారు. 'కథన కుతూహలం' అన్న అధ్యాయంలో కథనశైలిని వర్ణించారు. స్థానీయతను ప్రత్యేకంగా పరిశీ లించారు. శ్రీశ్రీ నారాయణబాబుల సామ్యాలు తేడాలపై ఒక అధ్యాయం వుంది. వీటన్నిటితో వంద పేజీలున్న ఈ పుస్తకం చదివిన తర్వాత నారాయణబాబు కవిత్వ విశిష్టతను అర్థం చేసుకోవడంతో పాటు మొత్తంగా తెలుగు కవిత్వం పట్ల, వివిధ సాహిత్య ధోరణుల పట్ల అవగాహన కూడా పెంచు కోగలుగుతాము. ఉత్తరాంధ్రలో కొత్త గళాలకు కోటి రాగాలు నేర్పిన పురిపండా అప్పలస్వామి, రోణంకి అప్పలస్వామి, చాగంటి సోమ యాజులు నారాయణబాబు గురిం చిన జ్ఞాపకాలను అనుభవా లను పంచుకున్న వ్యాసాలు అదనంగా భావించవచ్చు. ఆయా సందర్భాల్లో ఈ పెద్దలు ఆయన గురించి అభిమానంగా ఆర్ద్రంగా రాసిన వాటిని అనుబంధంలో చేర్చడం మెచ్చుకోదగ్గ విషయం. వీరంతా ఆయన రూపాన్ని, స్నేహాన్ని మరీ మరీ మెచ్చుకోవడం చూస్తే నారాయణ బాబు వ్యక్తిత్వం చూచాయగా తెలుస్తుంది. అయితే ఆయనలోని అస్థిరత్వాన్ని అరాచ కత్వాన్ని కూడా ఎవరూ దాచి పెట్టకపోవడం గమనార్హం.

డా॥ యు.ఎ. నరసింహమూర్తి
శ్రీరంగ నారాయణబాబు
కవితా వైశిష్ట్యం.
వెలం: 50/-, పేజీలు:100 ,
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

-పీపీ




**నేను ఎందుకు నాస్తికుణ్ణి అయ్యాను?**

భగత్ సింగ్
తెలుగు సేత:
మక్కెన సుబ్బారావు
వెల:15/-, పేజీలు:18
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్.

**ఫారిన్ సెంటు**

కథల సంపుటి
పెనుమాక నాగేశ్వర రావు
వెల:40/-, పేజీలు:122
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీటు,
హైదరాబాద్.

# మొక్కలను మలిస్తే...

ఆ...హా...ఏంటిది?
మనం చూస్తున్నది మొక్కలా! శిల్పాలా!
కట్టడాలా! జంతువులా! అనిపిస్తుంది
ఎవరికైనా. ఇవన్నీ మొక్కలే. కాకపోతే
వాటినే ఇలా రకరకాలుగా మలిచారు.
నీళ్లల్లో ఫీట్లు చేసే
డాల్ఫిన్లయినా...ద్వారపాలకుల్లా కాపలా
కాసే జంతువులైనా...చిన్ని మొక్కకు నీళ్లు
పోసే చెయ్యయినా...ఆడుకుంటున్న
పిల్లలైనా...రాజమహలైనా...అన్నీ
మొక్కలే. నమ్మబుద్ధవడంలేదు కదూ.
అదేనండీ ఆర్టంటే.
ఈ అపురూప కళాఖండాలను
సృజించిన ....
ఆర్టిస్టుకు అభినందనలు
అందిద్దామే.

# కలం స్నేహం

## హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

**పేరు:** బి. లక్ష్మి
**చదువు:** 5వ తరగతి
**వయస్సు:** 10 సం॥
**స్కూలు:** ఎం.పి.పి.ఎస్., బద్యాతండా
**లక్ష్యం:** టీచర్ కావడం
**హాబీలు:** రాయడం, చదవడం, ఆడడం, పాటలు పాడటం, డాన్స్ చేయడం
**చిరునామా:** బి. లక్ష్మి డాటరాఫ్: బి.బోజ్యా, ధర్మతండ, కూసుమంచి, ఖమ్మం.

**పేరు:** జి. ఉషా భాను
**చదువు:** 7వ తరగతి
**వయస్సు:** 11సం॥
**స్కూలు:** శ్రీ సాయి విద్యానికేతన్, పేరాల
**హాబీలు:** చిత్రలేఖనం, పజిల్స్ పూరించటం
**చిరునామా:** జి. ఉషా భాను, డాటరాఫ్: జి. రాజశేఖర్ రావు, 7-5-94. జిక్కావారి వీధి, పేరాల, చీరాల, ప్రకాశం.

**పేరు:** దుర్గం పరమేశ్వర్
**చదువు:** 10వ తరగతి
**వయస్సు:** 15 సం॥
**స్కూలు:** జడ్.పి.ఎస్.ఎస్ కలమడుగు
**లక్ష్యం:** ఇంజనీర్ కావడం
**హాబీలు:** చదవడం, ఆటలు ఆడడం
**చిరునామా:** డి. దుర్గం పరమేశ్వర్, సన్నాఫ్: గంగయ్య, బుట్టాపూర్, కడెం, ఆదిలాబాద్.

**పేరు:** చెరుకుపల్లి రాణి
**చదువు:** 10వ తరగతి
**వయస్సు:** 15 సం॥
**స్కూలు:** పోతేపల్లి ఉన్నత పాఠశాల
**లక్ష్యం:** ఇంజనీర్ కావడం
**హాబీలు:** చదవడం, టీవీ చూడడం
**చిరునామా:** చెరకుపల్లి రాణి, పోతేపల్లి, ఖమ్మం రూరల్, ఖమ్మం.

**పేరు:** బి. రఘు
**చదువు:** 4వ తరగతి
**వయస్సు:** 9 సం॥
**స్కూలు:** ఎం.పి.పి.ఎస్., బద్యాతండా
**లక్ష్యం:** ఎస్సై కావడం
**హాబీలు:** ఆటలు ఆడడం, పాటలు పాడడం
**చిరునామా:** బి. రఘు, సన్నాఫ్: బి. భోజ్యా, ధర్మతండా, కూసుమంచి, ఖమ్మం.

**పేరు:** బి. అజయ్‌కుమార్
**చదువు:** 7వ తరగతి
**వయస్సు:** 11 సం॥
**స్కూలు:** శ్రీవాణి విద్యాలయం, యు.పి.ఎస్., నంగునూరు
**లక్ష్యం:** డాక్టర్ కావడం
**హాబీలు:** చదవడం, టీవీ చూడడం, క్రికెట్ ఆడడం
**చిరునామా:** బి. అజయ్‌కుమార్, సన్నాఫ్: బి.కనకాంబరం, జోలపల్లి, మద్దూర్, వరంగల్.